సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 23-8-2024 15/-

## సంకీర్ణం బరువు పెరుగుతుందా?



### చరిత్ర మరచిన యోధులు వీరు



### జీవనోపాధి కలలపై డాలర్ల అలలు



సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 34 హైదరాబాద్
శుక్రవారం 23 ఆగస్టు 2024 రూ.15-00
18 సఫర్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**తల్లిదండ్రుల సేవ, వారికి విధేయత, వారి పట్ల సద్వ్యవహారం మూలంగా అల్లాహ్ మనిషి ఆయుష్షును పెంచుతాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at “Geeturai Graphics”, Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




26

**అల్లాహ్ ఎవరు?**

## లోపల...


| | | |
|---|---|---|
| అమ్మ | ...... | 04 |
| సంకీర్ణం బరువు పెరుగుతుందా? | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 43 | ...... | 09 |
| మరణానంతర జీవితం | ...... | 12 |
| చరిత్ర మరచిన యోధులు వీరు | ...... | 14 |
| పితృస్వామ్య వ్యవస్థ – ఇస్లాం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| దైవమార్గ బోధన – సంపూర్ణ నివారిణి | ...... | 20 |
| సౌమనస్యం ముద్దు వైమనస్యం వద్దు | ...... | 23 |
| జీవనోపాధి కలలు | ...... | 24 |
| అరబ్బులు ఆడు జీవితం | ...... | 29 |
| నవ జీవనం గురించి కలలు కన్న నాటి కవులు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


**థూ... మీ భాష పాడుగాను..**




కొంతమంది నేతలకు
నోటిదూల ఎక్కువట
అహంకారం నెత్తికెక్కి
ఏమయిన అంటరట!
థూ వీళ్ళ బతుకుజెడ
వీళ్ళు మనకు నేతలు
కర్రుకాల్చి పెట్టాల్నట
బుద్ధొచ్చేలా వాతలు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## అమ్మ

రెండు దేశాలు ...

ఇద్దరు క్రీడాకారులు...

ఇద్దరు అమ్మలు ...

ఒకే మాట ...

ఆ రెండు దేశాలు ఇండియా పాకిస్తాన్ దేశాలు. ఈ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని అందరికీ తెలుసు. రెండు దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగితే ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరుకుంటాయి.

ఆ ఇద్దరు క్రీడాకారులు నీరజ్ చోప్రా, నదీమ్ అర్షద్. జావలిన్ త్రో క్రీడలో తిరుగులేని వీరులు. క్రికెట్ తర్వాత భారత పాకిస్తాన్ దేశాల్లోని క్రీడాభిమానులు తప్పకుండా చూసేది నీరజ్ చోప్రా, నదీమ్ అర్షద్‌ల జావలిన్ త్రో పోటీ. పారిస్ ఒలింపిక్స్‌లో నదీమ్ అర్షద్ రికార్డు సృష్టించాడు. తన చేతిలోని బల్లాన్ని లేదా ఈటెను 92.97 మీటర్ల దూరం విసిరాడు. బంగారు పతకం సాధించాడు. నీరజ్ వెండి పతకం సాధించాడు. వీళ్ళిద్దరు క్రీడామైదానంలో ప్రత్యర్థులన్నది ఎంత నిజమో, మైదానం బయట మంచి మిత్రులన్నది అంతే నిజం. ఇద్దరు పుట్టి పెరిగింది గ్రామీణ వాతావరణంలో. ఇద్దరూ క్రీడాకారులుగా నిలబడడానికి తీవ్రంగా సంఘర్షించారు. ఇద్దరిదీ దాదాపు ఒకే వయసు. మొదటిసారి వీరిద్దరు 2016లో జూనియర్ వరల్డ్ అథ్లెటిక్స్‌లో పోటీపడ్డారు. అప్పటి నుంచి మంచి మిత్రులయ్యారు. 2018లో ఆసియన్ గేమ్స్‌లో నీరజ్ సిల్వర్ గెలిస్తే, నదీమ్ గోల్డ్ గెలిచాడు. ఆ తర్వాత నీరజ్ వరుసగా అనేకసార్లు నదీమ్ కన్నా పైచేయి చూపించాడు.

వారి స్నేహంలో చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరిగినా వారిద్దరు తిప్పి కొట్టారు. టోక్యో ఒలింపిక్స్ సందర్భంగా నీరజ్‌కు తన జావలిన్ కనిపించలేదు. పొరబాటున నదీమ్ ఆ జావలిన్ తనదిగా భావించి తీసుకు తిరుగుతున్నాడు. నీరజ్ వెళ్ళి నా జావలిన్ కదా అని అడిగిన వెంటనే నదీమ్ తన పొరబాటు గ్రహించి వెంటనే ఇచ్చేశాడు. కాని మీడియాలో ఇది పెద్ద చర్చ అయ్యింది. కాని నీరజ్ ఈ చర్చకు ఫుల్‌స్టాప్ పెడుతూ, క్రీడాకారులు ఒకరి జావలిన్ మరొకరు తీసుకోవడం జరుగుతుంటుందని దాన్ని పెద్ద విషయంగా చూపించవలసిన అవసరం లేదని, దీన్ని రాజకీయాలకు వాడుకోవద్దని నిక్కచ్చిగా చెప్పాడు. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో గాయం వల్ల నదీం పాల్గొనలేదు. నీరజ్ బంగారుపతకం సాధించాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో నదీం రాకపోవడం పెద్ద లోటని, తన మిత్రుడిని మిస్సయ్యానని ఆ సందర్భంగా నీరజ్ చెప్పాడు. వరల్డ్ అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్ నదీం గెలిస్తే, బంగారు పతకం నీరజ్ గెలిచాడు. గోల్డ్ సాధించిన నీరజ్ భారత పతాకం కప్పుకుని ఫోటో కోసం నిలబడినప్పుడు, పాకిస్తాన్ పతాకం దొరక్క కాస్త దూరంగా నిలబడిన నదీంను నీరజ్ వెంటనే తన వద్దకు పిలుచుకున్నాడు. ఇద్దరు కలిసి భారత పతాకం కప్పుకుని ఫోటోలు దిగారు. టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ బంగారు పతకం సాధించడంతో భారతదేశంలో జావలిన్ త్రో పట్ల ఆసక్తి పెరిగింది. కాని పాకిస్తాన్‌లో ఉన్న నదీంకు ఇలాంటి వాతావరణం లభించలేదు. ప్రాక్టీసు చేయ డానికి పాతబడిన జావలిన్ మార్చి కొత్త జావలిన్ కొనుక్కునే సొమ్ము కూడా లేదు. జావలిన్ కొనడానికి అవసరమైన నిధుల సేకరణకు కూడా నీరజ్ సహాయపడ్డాడు.

ఇప్పుడు ఆ ఇద్దరు అమ్మల గురించి మాట్లాడుకుందాం. పారిస్ ఒలింపిక్స్‌లో రికార్డు సాధించి నదీం బంగారు పతకం గెలిచిన తర్వాత నీరజ్ అమ్మ సరోజ్ దేవిని ఈ విషయం గురించి అడిగితే "వెండి పతకం రావడం చాలా సంతోషం. బంగారు పతకం గెలిచింది కూడా మా అబ్బాయే. వెండి పతకం గెలిచింది కూడా మా అబ్బాయే." అని చెప్పింది. నదీం చాలా బాగా ఆడాడని, నీరజ్, నదీమ్ ఇద్దరూ తనకు ఒక్కటేనని, రెండు పతకాలు తన పిల్లలకే దొరికాయని చెప్పింది.

ఎక్కడో ఉన్న పాకిస్తాన్ ఊళ్ళోని నదీమ్ అమ్మ రజియా పర్వీన్‌ను కూడా అక్కడ పత్రికలు ఈ ప్రశ్నే అడిగాయి. ఆమె మాట్లాడుతూ "నీరజ్, నదీమ్ ఇద్దరు సోదరులే. నీరజ్ కూడా మా అబ్బాయే. నేను నీరజ్ ఇంకా చాలా గెలుపులు సాధించాలని దుఆ చేస్తుంటాను" అని చెప్పింది.

ఇద్దరు అమ్మలు చెప్పింది ఒకే మాట

ఇద్దరు అమ్మలకు వారిద్దరు ఒక్కటే

ఇద్దరు క్రీడాకారులకు పోటీ మైదానంలోనే ... మైదానం బయట ఒకరికి మద్దతుగా మరొకరు నిలబడే స్నేహం.

ఈ ఇద్దరు అమ్మలు రెండు దేశాల అధినేతలు ఎలా ఉండాలో చెబుతున్నారు. ఈ ఇద్దరు క్రీడాకారులు రెండు దేశాల్లో ప్రజలు ఎలా ఉండాలో చెబుతున్నారు. వినేవాళ్ళు ఎవరైనా ఉన్నారా?

★★★



# సంకీర్ణం బరువు పెరుగుతుందా?

**పార్లమెంటు సమావేశాలు ముగిశాయి.** లోక్‌సభ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీని బీజేపీ సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించలేదు. బీజేపీ ఇకో సిస్టమ్ మొత్తం రాహుల్ గాంధీపై పప్పు ముద్ర వేయ డానికి రాత్రింబవలు కష్టపడింది. కాని లోక్‌సభ ఎన్నికల తర్వాత పరిస్థితి పూర్తిగా తల్లకిందులయ్యింది. ఇప్పుడు రాహుల్ గాంధీని చాలా సీరియస్‌గా తీసుకోక తప్పని పరిస్థితిలో బీజేపీ కనిపిస్తోంది. లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతున్నప్పుడు ప్రధాని మోడీ రెండు సార్లు కల్పించుకోవడం దానికి మొదటి నిదర్శనం. దీనివల్ల నిస్సందేహంగా రాహుల్ గాంధీ ఆత్మవిశ్వాసమే కాదు, మొత్తం కాంగ్రెసు పార్టీలోను ఉత్తేజం పెరిగింది. రాహుల్ గాంధీ ప్రతి ప్రసంగం పాలక పక్షాన్ని కుదిపేసిన సందర్భాలు లోక్‌సభలో కనిపించాయి.

కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కొత్త ఉత్సాహంతో కనిపిస్తోంది. ఒక ఖచ్చితమైన వ్యూహాన్ని పాటిస్తూ దళిత సభ్యులను లోక్ సభలో ముందువరుసలో నిలబెట్టారు. కుమారి సెల్జా, చరణ్ జిత్ సింగ్ చన్నీ, ప్రణితి షిండేల ప్రసంగాలు పాలకపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రణితి షిండే మహారాష్ట్రలో ఇప్పుడు కాంగ్రెసుకు ప్రముఖ నేతగా ఎదుగుతున్నారు. పార్లమెంటు సమావేశాల్లో స్పష్టంగా కనిపించిన విషయమేమిటంటే ఇండియా కూటమి ఒకేమాట, ఒకే బాటగా నిలబడింది. కూటమిలో ఎక్కడా ఎలాంటి విభేదాలు, వైరుధ్యాలు కనిపించలేదు. ఇది పాలకపక్షానికి మింగుడుపడని విషయం.

పాలక ఎన్డీయే కూటమిలో కలవరం లోక్‌సభలో కనిపించింది. ఇండియా కూటమి నుంచి దాడులకు జవాబు చెప్పుకోవడం, దీటుగా నిలబడడం బీజేపికి కత్తిమీద సామే అయ్యింది. బీజేపీ నేతలు అనురాగ్ ఠాకూర్, నిశికాంత్ దూబేలు రెచ్చగొట్టే ధోరణిలో, దూషణల స్థాయిలో చేసిన ప్రసంగాలు కూడా బీజేపీలో కలవరాన్నే బయటపెట్టాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిస్సహాయంగా కనిపించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం పార్లమెంటు సమావేశాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. గత పదేళ్ళుగా చూసిన పార్లమెంటు సమావేశాలకు ఈ సమావేశాలకు ఉన్న తేడాను చాలా మంది పాత్రికేయులు నిశితంగా విశ్లేషించారు.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన శివరాజ్ సింగ్ చౌహాన్ ఇప్పుడు కేంద్రంలో వ్యవసాయమంత్రి. నిజానికి లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన్ను మోడీ, షాలు పక్కన పెట్టేశారు. మధ్యప్రదేశ్‌లో ఆయన ప్రాముఖ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు చేశారు. కాని ఇప్పుడు ఆయనకు కేంద్రంలో మంత్రిపదవి ఇచ్చారు. కాస్త

గమనిస్తే బీజేపీ మంత్రుల్లో చాలా మంది ముఖ్యమంత్రులుగా స్థాన భ్రంశం పొందినవారే. వారి రాష్ట్రాల నుంచి తప్పించి ఇటు తీసుకు రాబడ్డారు. మనోహర్ లాల్ ఖట్టర్, జితన్ రాం మాంఝీ, హెచ్ డీ కుమారస్వామి, సర్బానంద్ సోనోవాల్ వగైరా. ఇందులో శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ఉన్నారు. విచిత్రమేమిటంటే, శివరాజ్ సింగ్ చౌహాన్ తనను మధ్యప్రదేశ్ నుంచి తప్పించడాన్ని పెద్ద సీరియస్ గా తీసుకున్నట్లు లేదు. 1947 తర్వాతి నుంచి 15 సార్లు ఎర్రకోట నుంచి ప్రసంగించిన నెహ్రూ గారు ఒక్కసారి కూడా ఆ ప్రసంగాల్లో "రైతు" అనే పదం వాడలేదని ప్రసంగాలు చదివి వినిపించారు. అంటే ఇప్పుడు రైతుల సమస్యలకు కారణం అప్పుడు నెహ్రూ గారు తన ప్రసంగాల్లో రైతు అనే పదం వాడకపోవడమేనా? రైతులకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని చెప్పారు. రైతులు కోరుతున్నది న్యాయ పరమైన రక్షణతో గిట్టుబాటు ధర అనేది ఆయనకు తెలియదా?

ఈ పార్లమెంటు సమావేశాల్లో గమనించవలసిన విషయమేమిటంటే ఇండియా కూటమిలోని పార్టీలు ఒక్కతాటిపై నడిచాయి. బీజేపీ నాయకుడు అనురాగ్ ఠాకూర్ ప్రసంగంలో రాహుల్ గాంధీపై దాడి చేస్తే వెంటనే సమాజవాది పార్టీ నాయకుడు అఖిలేష్ ఆగ్రహంతో ప్రతిస్పందించాడు. కాని ఈ ఐక్యత ఎన్డీయే కూటమిలో కనిపించలేదు. ఇండియా కూటమితో బీజేపీ నేతలు వాగ్వాదానికి దిగినప్పుడు ఎన్డీయే కూటమిలోని ఇతర పక్షాలు చూస్తూ కూర్చు న్నాయి తప్ప కల్పించుకోలేదు. ఇండియా కూటమి మొత్తం ఒకే గొంతుగా వినిపిస్తుంటే, ఎన్డీయే కూటమి లోని పార్టీలు మాత్రం బీజేపీకి మద్దతుగా నిలబడ్డం కనిపించలేదు. బీజేపీ తన సొంత యుద్ధాలు తానే చేసుకోవాలని, తమను లాగరాదని స్పష్టమైన సంకేతం ఎన్డీయే పార్టీలు ఇస్తున్నాయి. ఎన్డీయేలో పార్టీలు బీజేపీతో మీ పని మీరు చూసుకోండి, మా పని మేము చేసుకుంటాం ధోరణిలో వ్యవహరిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి కొలువుదీరి రెండు నెలలు గడిచాయి. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తర్వాత పరిస్థితి ఇది. ఈ సంకీర్ణం ఎంతకాలం కొనసాగు తుందన్న అనుమానాలు ఈ పరిస్థితి వల్ల బలపడుతున్నాయి.

ఈ సమావేశాల్లో హఠాత్తుగా బీజేపీ వక్ఫ్ సవరణ బిల్లు తీసుకు వచ్చింది. బీజేపీకి మద్దతిస్తున్న తెలుగుదేశం పార్టీ ఎలాంటి శషబిషలు లేకుండా ప్రతిపక్షాలతో కలిసి ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండ్ చేసింది. జేడీయు నాయకుడు, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఈ బిల్లును లోక్ సభలో సమర్థించాడు. కాని పార్టీ నాయకత్వం అక్షింతలు వేసింది. తర్వాత బీహారు మంత్రి విజయ్ చౌదరీ కూడా ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలన్నారు. మైనారిటీల భయసందేహాలను నివృత్తి చేయడం అవసరమని కూడా వ్యాఖ్యానించారు. క్లుప్తంగా చెప్పాలంటే తెలుగుదేశం, జేడీయులకు మొత్తం 28 మంది సభ్యుల బలం ఉంది. మోడీ ప్రభుత్వం నిలబడాలంటే ఈ రెండు పార్టీల ఊతకర్రలు అవసరం. ఈ రెండు పార్టీలు వ్యతిరేకించాయి కాబట్టి వక్ఫ్ బిల్లు అటకెక్కింది. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే ఈ బిల్లుపై చర్చ జరిగితే బాగుండునని బీజేపీ కూడా భావించింది. ఎందుకంటే, అక్టోబర్, నవంబర్ మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తు న్నాయి. ఈ చర్చ జరిగితే చాలు బీజేపీకి ముస్లిం వ్యతిరేక ప్రచారం చేసే మరో అవకాశం దొరుకుతుంది. ఆ అవకాశం లేకుండా ఇప్పుడు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపేయక తప్పలేదు. నూట నలభైమంది సభ్యులను బహిష్కరించైనా తాము కోరుకున్న చట్టాలు చేసిన పార్టీకి ఇప్పుడు ఈ పరిస్థితి మింగుడు పడడంలేదు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే మిత్రపక్షాల ఒత్తిడికి తలొగ్గి చేయాలనుకున్న చట్టం విషయంలో వెనక్కి తగ్గడం బీజేపీ ఓటమిగానే భావించాలి.

పార్లమెంటులోనే కాదు పార్లమెంటు బయట కూడా ఎన్డీయే మిత్ర పక్షాలు తమ వైఖరి విషయంలో నిక్కచ్చిగా కనిపిస్తున్నాయి. మహా రాష్ట్రలో ఏకనాథ్ షిండే నాయకత్వంలోని శివసేన 113 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 46 మంది ఇంచార్జిలను నియమించింది. దాంతో పాటు 93 మంది అబ్జర్వర్లను కూడా నియమించుకున్నారు. అంటే ఈ 113 స్థానాల్లో బీజేపీకి అవకాశం ఇవ్వడం లేదని చెప్పకనే చెప్పేశారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలున్నాయి. అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ పార్టీ తమకు 90 స్థానాలు కావాలని భీష్మించింది. మహారాష్ట్రలో మిత్రపక్షాల డిమాండ్లకు బీజేపీ తలొగ్గక తప్పని పరిస్థితి. అంటే మహారాష్ట్రలో బీజేపీ మహా అయితే వంద స్థానాలకు మించి పోటీ చేసే స్థితి ఉండదు. 2019లో బీజేపీ గెలిచిన స్థానాలు 105.

మిత్రపక్షాలతో నెట్టుకు రావడం ఇప్పుడు బీజేపీకి తలకు మించిన భారంగా మారుతోంది. మహారాష్ట్రలో ముఖ్యమంత్రి పదవి ఎవరికి? రెండు పార్టీల్లో ఉన్న ఇద్దరు డిప్యూటీ ముఖ్యమంత్రుల్లో ఎవరికి వారే ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారు. ఒకరి బలాన్ని మరొకరు తగ్గించాలనుకుంటున్నారు. ఈ పరిస్థితి ప్రతిపక్షాలకు సానుకూలంగా మారుతోంది.

కర్నాటకలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. జనతాదళ్ సెక్యులర్‌తో ఇప్పుడు సంబంధాలు గొప్పగా ఏమీ లేవు. మైసూరు నుంచి బెంగుళూరుకు బీజేపీ తలపెట్టిన పాదయాత్రకు జనతాదళ్ సెక్యులర్ దూరంగా ఉండాలనుకుంది. చివరకు బీజేపీ కుమారస్వామిని బతిమాలి బామాలి ఒప్పించాల్సి వచ్చింది. ఇదంతా జనతాదళ్ సెక్యులర్ నాయకుడు ప్రజ్వల్ రేవన్న సెక్స్ స్కాండల్ ఎఫెక్ట్. దేశంలో అత్యంత హీనమైన సెక్స్ స్కాండల్ ప్రజ్వల్ రేవన్నది. ఇప్పుడు ఆ విషయంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలేమిటో ఎవరికీ తెలియదు. మీడియా కూడా మౌనమే నా భాష అంటోంది. ఇలాంటి సిగ్గుమాలిన స్కాండల్స్ విషయాన్ని కూడా మరిచిపోయే రాజ కీయాలు నడుస్తున్నాయి. జనతాదళ్ సెక్యులర్ పార్టీ బీజేపీ పాద యాత్రకు దూరంగా ఉండాలని ఎందుకు నిర్ణయించిందంటే, బీజేపీ

ఎమ్మెల్యే ప్రీతమ్ గౌడ ఈ సెక్స్ స్కాండల్ వీడియోలు ఉన్న పెన్ డ్రైవ్ బయటకు వచ్చేలా చేశాడన్న అనుమానాలు. ఇదే నిజమైతే ఒక సంస్కారహీనమైన నీచమైన నేరానికి పాల్పడిన ఆరోపణల విషయంలో జనతాదళ్ సెక్యులర్ వ్యవహారం అత్యంత ఆక్షేపణీయం. బీజేపీతో జనతాదళ్ సెక్యులర్ దూరానికి ఇదొక్కటే కారణం కాదు, జనతాదళ్ సెక్యులర్ బలంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ విస్తరించ కుండా కట్టడి చేయడం కూడా దీని వెనుక ఉంది.

బీజేపీ మిత్రపక్షాలు 24 ఉన్నాయి. ఇందులో తెలుగుదేశం, జేడీయు, శివసేన (షిండే), ఎన్సీపీ, జేడీయస్ మాత్రమే కాకుండా చిరాగ్ పాశ్వాన్ పార్టీ లోక్ జనశక్తి పార్టీలు కాస్త బలమైనవి. ప్రస్తుతం లోక్ సభలో ఈ పార్టీలకున్న సీట్ల బలమే కాదు, వివిధ ప్రాంతాల్లో ఈ పార్టీలకు ఉన్న రాజకీయ బలం కూడా కీలకమైనది. ఈ పార్టీలకు కోపమొచ్చే పని ఇప్పుడు బీజేపీ చేయడం చాలా కష్టం. ఇక ఎన్డీయేలోని ఇతర మిత్రపక్షాలు లోక్ సభలో ఒకట్రెండు స్థానాలు ఉన్న పార్టీలు. పైగా ఈ పార్టీలు ఎప్పుడు ఎన్డీయే నుంచి బయటకు వెళతాయో చెప్పడం కూడా కష్టం. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన పార్టీలు ఎప్పుడైనా ఎన్డీయేకు బై బై చెప్పవచ్చు. ఎందుకంటే ఈశాన్య రాష్ట్రాల్లో ఇప్పుడు బీజేపీ వ్యతిరేకత బాగా పెరిగింది.

తెలుగుదేశానికి కేంద్ర నిధులు కావాలి. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర సహాయం అవసరం. జగన్మోహన్ రెడ్డి ప్రతిఘటనలను ఎదుర్కోడానికి కూడా కేంద్ర సహాయం అవసరం. బీహారులో నితీష్ కుమార్ కు ఆర్జెడీ నాయకుడు తేజస్వీ యాదవ్ కు మధ్య పొత్తు కుదిరే అవకాశాలు లేవు. కాబట్టి చంద్రబాబు నాయుడుకు, నితీష్ కుమార్‌కు మోడీ అవసరం ఎక్కువగానే ఉంది. కేంద్ర బడ్జెటులో ఆంధ్రప్రదేశ్‌కు, బీహారుకు లభించిన కేటాయింపులు చూస్తే ఈ ఇద్దరు నాయకులు తమకు కావలసింది సాధించుకున్నారన్నది స్పష్టంగానే తెలుస్తోంది. అయితే ఈ క్రమంలో తెలుగుదేశం కాని, జేడీయు కాని తమ తమ రాష్ట్రాల్లో రాజకీయంగా పతనమయ్యే విధంగా బీజేపీ నిర్ణయాలకు వత్తాసు పలకడం కూడా జరగదని వక్ఫ్ బిల్లు విషయంలో ఈ పార్టీల వైఖరి స్పష్టం చేసింది.

ఇండియా కూటమిలో మొత్తం 237 మంది సభ్యులున్నారు. బీజేపీ బలం 240. ప్రతిపక్షాల్లో ప్రధాని పదవిపై కన్నేసిన వారు చాలా మంది ఉన్నారని కూడా బీజేపీ భావించవచ్చు. అలాగే తెలుగుదేశం, జేడీయు, శివసేన పార్టీలకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం కాబట్టి తమను వ్యతిరేకించరన్న ధీమా కూడా బీజేపీలో ఉండేది. అందువల్లనే బీజేపీ తన రాజకీయ ఎజెండాను కొనసాగించే నిర్ణ యాలు తీసుకుంది. మిత్రపక్షాల ప్రతిస్పందనల గురించి పట్టించు కోలేదు. సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పుడు ఆడింది ఆటగా సాగింది. కాని ఇప్పుడు తమకు కేంద్రప్రభుత్వ అవసరం ఉన్నప్పటికీ కొన్ని నిర్ణయాల విషయంలో బీజేపీకి మద్దతిచ్చేది లేదన్నట్లు తెలుగుదేశం, జేడీయు పార్టీలు స్పష్టం చేశాయి.

ఇప్పుడు బీజేపీ పెద్దలు పునరాలోచన చేసుకోవలసిన అవసరం వచ్చింది. బీహారులో నితీష్ కుమార్ పదవికి ప్రమాదం రానంత వరకు ఆయన నుంచి సమస్యలు రాకపోవచ్చు. నితీష్ కుమార్ నిజానికి తన పార్టీ గురించి కూడా పట్టించుకోకపోవచ్చు. బీహారులో బీజేపీ బలం పెరిగినా ఆయనకు అభ్యంతరం ఉండకపోవచ్చు. ఆయనకు కావలసింది తాను పదవిలో కొనసాగడం. కాని ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగుదేశం పరిస్థితి అది కాదు. నారా లోకేష్ ను రాజకీయ వారసుడిగా ప్రతిష్ఠించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగుదేశాన్ని బలమైన పార్టీగా మార్చి లోకేష్ చేతుల్లో పెట్టాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికి కూడా వైయ స్సార్ సిపికి 39 శాతం ఓట్లున్నాయన్నది మరిచిపోరాదు. కాబట్టి బీజేపీ రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు అనుమతించడం సాధ్యం కాదు.

ఎన్డీయే పక్షాల్లో ఉన్న ఈ లుకలుకలు బయటపడడం లేదు కాని బీజేపీకి అవసరమైనప్పుడు ఎన్డీయే మిత్రపక్షాలేవీ మద్దతుగా నిలబడడం లేదన్నది కూడా స్పష్టమైన విషయం. బీజేపీ ఈ లోక్ సభ ఫలితాల్లో ఏదీ మారలేదన్నట్లు వ్యవహరించడానికి ప్రయత్నిస్తోంది. లోక్ సభలో స్పీకర్ ఓం బిర్లా ను తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు నిలదీసిన సంఘటన, సభలో ప్రతిపక్షాల దూకుడు, రాజ్యసభలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ వైఖరి, వినేష్ ఫోగాట్ పై చర్చను నిరాకరిస్తూ ఆయన వ్యవహారశైలి, కాంగ్రెస్ నాయకుడు ఖర్గేపై ఆయన చేసిన వ్యాఖ్యలు, జయబచన్ పట్ల ఆయన వ్యాఖ్యలు చివరకు ఆయనపై అభిశంసన తీర్మానం వరకు వెళుతున్నాయని తెలుస్తోంది. ఇది బీజేపీకి ఇబ్బందికరమైన పరిస్థితి.

వీటన్నింటి మధ్య పార్లమెంటులో రైతులతో సహా వివిధ బృందాలను రాహుల్ గాంధీ పిలిచి మాట్లాడుతున్నారు. జనబాహుళ్యంలో రాహుల్ గాంధీ ప్రతిష్ఠ పెరుగుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తు న్నాయి. మరోవైపు మోడీ ప్రభ మసకబారుతోంది. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ఈడీ అరెస్టు చేయవచ్చన్న వార్తలు వచ్చాయి. వీటన్నిం టికి తోడు హిండెన్ బర్గ్ మరో సంచలన నివేదిక బయటపెట్టింది. సెబీ అధినేతకు, అదానీకి మధ్య సంబంధాలు బయటకు పొక్కడం బీజేపీకి ఇప్పుడు చక్రవ్యూహంలో ఇరుక్కున్న పరిస్థితి. రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ద్వారా వీటన్నింటి నుంచి బీజేపీ గట్టెక్కే ప్రయత్నాలు చేయవచ్చని కొందరి అభిప్రాయం.

ఏది ఏమైనా లోకసభ ఎన్నికలు ముగిసి ఏర్పడిన కొత్త లోకసభ మునుపటి లోక్ సభలా లేదు. పరిస్థితులు మారుతున్నాయి. ఈ మార్పు మేలు దిశగా కొనసాగాలని ఆశిద్దాం. ✤

## దోష సవరణ

గీటురాయి **16-08-2024** సంచికలోని 12,13 పేజీలలో **బంగ్లాదేశ్ పరిణామాలపై** వచ్చిన వ్యాసంలో నాలుగు చోట్ల జులై అని వచ్చింది. దానిని ఆగస్టుగా సవరించుకోవలసిందిగా మనవి. ఈ వ్యాస రచయిత పేరు పొరపాటున ముద్రణలో రాలేదు.

వ్యాస రచయిత **"ముహమ్మద్ అజీజుర్రహ్మాన్"**.

జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాము.

**- సంపాదక వర్గం**

అధ్యాయం -16

43

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

**ఎస్.ఎమ్. మలిక్**

### శత్రు కూటమి పోరులో

హి|జ్రీ 5వ సంవత్సరం కందక పోరాటం సంభవించింది. అందులో శత్రువుల విభిన్న తెగలు కుట్ర పన్ని సమైక్యంగా దాడి జరపాలని నిర్ణయించినట్లు ప్రవక్త(శ్రీకి తెలిసింది. అప్పుడు సహచరుల సలహాల ననుసరించి త్రవ్విన కందకానికి ఈవల సైనిక దళాలను నియమించడం జరిగింది. ఒక దానికి మహనీయ అలీ నాయకత్వం వహించారు. ఓ రోజు కురైష్ సేనలు గుర్రాలను దౌడు తీయిస్తూ కందకాన్ని దాటాలని మహనీయ అలీ కమాండ్‌లోని ప్రాంతానికి వచ్చారు.

ఆ ప్రయత్నంలో ఓ మక్కా సిపాయి కందకంలో పడి హతమయి పోయాడు. ఒకరిద్దరిని ముస్లిములు పట్టి సంహరించారు. కందకాన్ని దాటి వచ్చిన వారిలో అమ్ర్ బిన్ వుద్ద్ అనే అశ్వారూఢంలో ఖ్యాతి గడించిన వాడున్నాడు. అతని వైపునకు అలీ, "నీవు మరణించడానికి ఇలా తొందరపడవలసింది కాదు" అంటూ లంఘించారు. అతను, "అనుభవం లేని కుర్రోడా! నీ అవివేకానికి కోప్పడను, ఇంతకూ నా పోటీకి ఇక్కడ ఎవ్వరూ లేకపోవడం శోచనీయం" అంటూ ఉండగానే దేవుని బెబ్బులి అలీ(ర) సమీపానికి వచ్చి, "ఇక చాలించు, నీకు చావు మూడనుంది, మాటలాడే వ్యవధి దొరకదు" అంటూ దాడి చేశారు. అంతే, అతని తల ఎగిరి దూరాన పడి పోయింది!

అతని సిపాయిలు ఇతర ముస్లిమ్ యోధులతో పోరులో హతమయ్యారు. శత్రువులు సూర్యాస్తమయం వరకు అంబులు కురిపిస్తూనే ఉన్నారు. అస్ర్ నమాజ్ చేయలేక పోయారు అలీ(ర). దానికి ఆయన చింతిల్లుతూనే ఉన్నారు. ప్రవక్త(శ్రీ(స) ఇలా శపించారని కూడా ఆయనే ఉల్లేఖించారు,

"మేము కందక పోరులో ఉండగా ప్రవక్త మహనీయులు, 'దైవం వారి గోరీలను నిప్పుతో నింపుగాక! వారి కారణంగా మాకు అస్ర్ నమాజ్‌కు వ్యవధి దొరకలేదు, సూర్యాస్తమయం అయిపోయింది" అన్నారు.

### ఓ దుర్ఘటనలో

హి|జ్రీ 5వ సంవత్సరం, షాబాన్ నెలలో బనూ ముస్తలిక్ తెగ వారిని ఎదుర్కొనేందుకు బయలుదేరే సమయంలో మామూలు ప్రకారం చీటీ వేసి మహనీయ ఆయిషా(ర) పేరు రాగా ఆవిడని వెంట తీసుకువెళ్ళారు. ఆ పైన

విరోధుల్ని జయించి తిరిగి వచ్చేసరికి రాత్రి అయింది. అక్కడే రేయి గడిపారు. తెల్లవారక మునుపు మహనీయ ఆయిషా(ర) కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాస్త దూరంగా వెళ్ళారు. వచ్చే వరకు సేన వెళ్ళిపోయింది. వారు బయలుదేరే ముందు మహనీయ ఆయిషా కూర్చునే తొట్లను, ఆవిడ అందులో ఉన్నారనుకుని సిపాయీలు ఎత్తి ఒంటె పైన పెట్టి తీసుకు వెళ్ళారు. అప్పుడు మహనీయ ఆయిషా అంతగా బరువుగా ఉండేవారు కాదు.

మహనీయ ఆయిషా(ర) తిరిగి వచ్చి చూడగా ఎవరూ లేరు. వెళ్ళిన వారు మున్ముందు తాము ఆగే చోట, తాను లేని విషయం గమనించి ఎవరినయినా పంపుతారని తలపోసి, ఆమెకు బాగా నిద్ర వస్తూ ఉంటే అక్కడే దుప్పటి కప్పుకుని పడుకున్నారు. ఇక బిడారు వెళ్ళిపోయిన తరువాత అంతా పరిశీలించి వెనకాల వచ్చే బాధ్యత గల సఫ్వాన్ బిన్ ముఅత్తల్ అటు నుంచి వెడుతూ ఈవిడ పరుండటం గమనించి, **'ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్'** పఠించారు.

## అపనింద

పరదా ఆదేశాలు రాక మునుపు సఫ్వాన్ ఆవిడను చూసి ఉన్నారు కాబట్టి చూడగానే గుర్తు పట్టారు. అప్పటికి మహనీయ ఆయిషా (ర) కూడా నిద్ర లేచారు. వెంటనే తన ఓణీ కప్పుకున్నారు ఆవిడ. ఆమెను తన ఒంటెపైన కూర్చోబెట్టు కుని బిడారు ఉన్న చోటికి వచ్చారు సఫ్వాన్. కపటులు దీని పైన అపనిందల ఓ తుఫాను లేవనెత్తారు. మహనీయ ఆయిషా(ర)కూ సఫ్వాన్‌కు మధ్య చెడు సంబంధాన్ని అంట గట్టారు. వారి మాటలకు గురయి కొందరు ముస్లిములు సయితమూ అపార్థానికి లోనయ్యారు. ఉల్లేఖనాలలో ముగ్గురి పేర్లు కానవస్తాయి. 1. మిస్తహ్ బిన్ ఉసాస, 2. హస్సాన్ బిన్ సాబిత్, 3. హమ్నా బిన్తు జష్.

అపనిందల ఈ వదంతుల మధ్యన విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఆయిషా(ర) తన తండ్రి ఇంటికి వెళ్ళిపోయారు. ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) మహనీయ అలీ(ర), మహనీయ ఉసామా బిన్ జైద్(ర)ని సలహా కొరకు పిలిపించారు. మహనీయ ఉసామా(ర) ఆ పవిత్ర మూర్తిని గురించి తన అవగాహన రీత్యా, "దైవ ప్రవక్తా! మీ సతీమణిలో మేము పూర్తిగా మంచినే తప్ప ఎటువంటి విషయాన్నీ కాన లేదు. ఇదంతా పూర్తిగా అపవాదు, అబద్ధం మాత్రమే. మీరు దీన్ని ఏ మాత్రం పట్టించుకోనక్కర లేదు" అన్నారు.

మహనీయ అలీ మాత్రం, "దైవప్రవక్తా! మహిళల కేమి కొదువ, మీరు ఆమెకు బదులు మరో భార్యను చేసుకో గలరు. విచారణ నిమిత్తం ఇంటిలోని సేవకురాలిని పిలిచి విచారించండి. ఆమె సరయిన విషయం తెలుపగలదు" అన్నారు.

దాదాపు ఒక నెల వరకు దైవప్రవక్త(స), తన సతీమణి తోపాటు తాను కూడా ఆ పుకార్ల కారణంగా అత్యంత వ్యధ ననుభవించారు. ఆ పైన అన్ నూర్ సూరా అవతరించింది. అందులో,

"మీరు (ఆ తప్పుడు వ్యర్థ ప్రేలాపన) విన్నంతనే, అప్పటి కప్పుడే జాగు చేయకుండా విశ్వాసులయిన పురుషులూ, స్త్రీలు సదభిప్రాయంతో ఇది స్పష్టంగా అపనింద అని కొట్టి పారేయవలసింది." (అన్ నూర్ : 12) అని ప్రకటించడం జరిగింది.

మహనీయ ఉసామా(ర) చెప్పింది కూడా అదే. ఈ హంగామా అంతా అబద్ధాల పుట్ట అని చెప్పారు. మహనీయ అలీ(ర) సూత్రప్రాయమయిన సమాధానం ఇచ్చారు. కాని ఆయన అపనింద మోపిన వారిలో ముమ్మాటికీ లేరు. ఉల్లేఖనాల ప్రకారం, ఆ తరువాత మహనీయ ఆయిషా(ర) కూడా మహనీయ అలీ ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉన్నారని చెప్పారు.

## హుదైబియా ఒప్పందం

హిజ్రీ 6వ సంవత్సరం జీకఅద నెల, హుదైబియా అనే చోట ప్రవక్తశ్రీ(స) సహచరులు ఆయన(స) చేతి మీదుగా ఓ ప్రమాణం చేశారు. దాన్ని 'బయ్తె రిజ్వాన్' అంటారు. అప్పుడే మక్కావాసులతో ఓ ఒప్పందమూ జరిగింది. దాన్ని హుదైబియా ఒప్పందం అన్నారు చరిత్ర కారులు. ఈ రెంటిలోనూ మహనీయ అలీ చురుగ్గా పాల్గొన్నారు. దివ్య కుర్‌ఆన్ లోనూ దీని ప్రస్తావన వచ్చింది.

అల్లాహ్ విశ్వాసుల ఎడల వారు చెట్టు కింద నీతో బయ్తె ప్రమాణం చేస్తున్నప్పుడు సంతుష్టుడయ్యాడు.

*(అల్ ఫత్హ్ 48 : 18)*

ప్రవక్తా! మేము (ఆ ఒప్పందం ద్వారా) నీకు ప్రస్ఫుటమయిన

విజయాన్ని అనుగ్రహించాము. (అల్ ఫత్హ్ 48 : 1)

ఇంకా,

విశ్వాసుల అంతర్యాలలో నెమ్మదిని అవతరింపజేసిన వాడూ ఆయనే, తద్వారా వారు తమ విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసుకోవాలని అని కూడా అందులో ఉంది.

ఈ విజయ సహాయం, నెమ్మదిని కలగజేసిన ఒప్పందాన్ని ప్రవక్త(స) మహనీయ అలీ(ర) చేత గ్రంథస్థం చేయించారు.

ఆయన ఒప్పందం ప్రారంభంలో నియమానుసారంగా 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' వ్రాశారు. మక్కావాసుల ప్రతినిధి సుహైల్, ఇది అనవసరం అని, దానికి బదులు 'బిస్మిక అల్లాహుమ్మ' అని వ్రాయమన్నాడు. అలాగే చెయ్యి అన్నారు ప్రవక్త(స). ఆ తరువాత 'ఇది దైవప్రవక్త ముహమ్మద్ మరియు మక్కావాసుల మధ్య జరిగిన ఒప్పందం' అని మొదలెట్టారు. సుహైల్ దానికి అభ్యంతరం వెలిబుచ్చాడు, "మేము మిమ్మల్ని దైవప్రవక్తగా ఒప్పుకుంటే ఇక జగడమేముందీ" అన్నాడు. అందువల్ల తండ్రి పేరుతో మీ పేరు వ్రాయాలని కోరారు.

అప్పుడు ప్రవక్త(స), "ఇబ్ను అమ్ర్, నేను దైవప్రవక్తనే, మీరు ఇష్టపడినా ఇష్టపడక పోయినా, నమ్మినా నమ్మకపోయినా" అన్నారు. దానికి సుహైల్, "కాని ఈ వ్యవహారం మిమ్మల్ని ప్రవక్తగా అంగీకరించని వారికి సంబంధించింది" అన్నాడు. ప్రవక్త మొదట వ్రాసిన పదాలు చెరిపి వేయాలని కోరారు. కాని అలీ దానికి అది తన వల్ల కాదని అన్నారు. అప్పుడు ప్రవక్త(స) స్వయంగా తన చేత్తో చెరిపారు. ఆ ఒప్పందం ప్రకారం ముస్లింలు మరుసటి సంవత్సరం మక్కాకు వచ్చి ఉమ్రా (ఖజా) చేసుకోవచ్చు. అయితే ప్రవక్త(స) తన సహచరుల తోపాటు మూడు రోజుల్లో అక్కడి నుంచి వెళ్ళిపోవాలి. అందువల్ల తిరస్కారులు అలీ వద్దకు వచ్చి, "మీ అయ్యగారికి చెప్పు ఇక బయలుదేరవలసిందే, వ్యవధి ముగిసింది" అన్నారు.

ఉహుద్ యుద్ధంలో అమరగతి పొందిన మహనీయ హమ్జా గారి కూతురు మహనీయ అలీని చూసింది. ఆమె, బాబాయ్, బాబాయ్! అంటూ పరిగెత్తుకు వచ్చింది. ఆమెను తీసుకుని అలీ, "ఇదో మీ బాబాయి కూతురు, నేను తీసుకు వచ్చాను" అంటూ మహనీయ ఫాతిమాకు అప్పగించారు. ఆపైన ఇద్దరు ఆమె పెంపకానికి ముందుకు వచ్చారు. అంటే మహనీయ జైద్, మహనీయ జాఫర్. మహనీయ జాఫర్ వాదన, ఆమె తన బాబాయి కూతురు ఇంకా ఈమె పిన్ని తన భార్య అన్నది, మహనీయ జైద్ ప్రకారం ఆమె తన సోదర తనయ అన్నది.

అయితే దైవప్రవక్త మహనీయ జాఫర్ పక్షంలో తీర్పు చెప్పారు. కారణం, మహనీయ జాఫర్ భార్య ఆ పాపకు పిన్ని కావడం చేత, పిన్ని తల్లి స్థాయి గలవారవడం చేతనూ ఆయనకే హక్కు కలిగించారు. ఆ నిర్ణయం తరువాత ఆ ముగ్గురిని ప్రత్యేకంగా సంబోధించి, ఎవరికీ బాధ కలగకుండా ఇలా అన్నారు,

"అలీ! నీవు నా లోని వాడవు, నేనూ నీకు చెందిన వాడినే. జాఫర్! నీవు స్వరూపం రీత్యాను, స్వభావం దృష్ట్యాను నన్ను పోలిన వాడివి. జైద్! నీవూ మా సోదరుడివి." ❖

## తస్మాత్ జాగ్రత్త!

ఆంధ్రప్రదేశ్ నుండి కొంతమంది గీటురాయి పాఠకులు, రచయితలు ఫోన్ చేసి **"ఇదియే ఇస్లాం"** పుస్తకాన్ని పూర్తిగా ఎందుకు ప్రచురించలేదు? చివరి రెండు అధ్యాయాలు అందులో లేవేమీ? అని ప్రశ్నిస్తున్నారు. దైవ కృప వల్ల **'రిసాలె దీనియాత్'** ఉర్దూ పుస్తకాన్ని టి.ఐ.పి ఆధ్వర్యంలో 1982లోనే పూర్తిగా తెలుగులో ప్రచురించటం జరిగింది. కొంతమంది ఆ పుస్తకంలోని చివరి రెండు అధ్యాయాలను తీసేసి వాట్సప్‌లో వైరల్ చేస్తున్నారని తెలిసింది. పాఠకులు గమనించగోర్తాము. పూర్తి మ్యాటర్ చదవదలచినవారు టి.ఐ.పి నుండి పుస్తకాన్ని తెప్పించుకోగలరు. **– డైరెక్టర్**

# స్వర్గంలో అందరికన్నా ముందుగా...

- ముహమ్మద్ వహీదుద్దీన్



**తమ** సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చుచేసేవారి ఉపమానం ఇలా ఉంటుంది : ఒక విత్తనాన్ని నాటితే అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపజేస్తాడు. (దివ్యఖుర్ఆన్ 2: 261)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : ప్రతిరోజు ఇద్దరు దైవదూతలు భూలోకానికి దిగివస్తారు. వారిలో ఒకరు “ఓ అల్లాహ్! నీ మార్గంలో ధనం ఖర్చుపెట్టేవాడికి సుగుణవంతులైన సంతానాన్ని అనుగ్రహించు” అని ప్రార్థిస్తే రెండవ దూత “ఓ అల్లాహ్! పిసినారికి అతని ధనాన్ని నాశనం చేసే సంతానాన్ని ప్రసాదించు” అని శపిస్తుంటాడు. (బుఖారీ, ముస్లిమ్)

దానం దైవాగ్రహాన్ని శాంతపరుస్తుంది.

దానం నికృష్టమైన చావు నుండి కాపాడుతుంది

దానం వల్ల ఆయుష్షు పెరుగుతుంది.

దానం చేస్తే గర్వాహంకారాలు దూరమవుతాయి.

దానశీలికి శుభం కలగాలని దైవదూతలు ప్రార్థిస్తూ ఉంటారు.

దానం చేసేవారు స్వర్గంలోకి అందరికన్నా ముందుగా ప్రవేశిస్తారు. (తిర్మిజీ)

అల్లాహ్ గ్రంథాన్ని పారాయణం చేసేవారు, నమాజ్‌ను స్థాపించేవారు, మేము వారికి ఇచ్చిన ఉపాధి నుండి బహిరంగంగాను, రహస్యంగాను, ఖర్చు చేసేవారు నిశ్చయంగా ఏమాత్రం నష్టం రాని వ్యాపారాన్ని కోరుకుంటున్నారు. (ఈ వ్యాపారంలో వారు తమ సర్వస్వాన్ని ఎందుకు ధారపోశారంటే), అల్లాహ్ వారి ప్రతిఫలాలను పూర్తిగా వారికి ఇవ్వాలని, అదనంగా తన అనుగ్రహం నుండి ఇంకా వారికి ప్రసాదించాలని. నిస్సంశయంగా అల్లాహ్ క్షమించేవాడూ, విలువనిచ్చేవాడూనూ. (దివ్య ఖుర్ఆన్ 35: 29,30)

మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టనంత వరకు మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (దివ్య ఖుర్ఆన్ 3: 92)

మేము ప్రసాదించిన ఉపాధి నుండి (సత్కార్యాల కోసం) రహస్యంగాను, బహిరంగంగాను ఖర్చుపెడతారు. (దివ్య ఖుర్ఆన్ 13: 22)

తన సంపదను రేయింబవళ్ళు బహిరంగంగా, రహస్యంగా ఖర్చుచేసేవారు తమ ప్రతిఫలాన్ని తమ ప్రభువు వద్ద పొందుతారు. వారికి ఏవిధమైన భయంగాని, దుఃఖం గాని కలిగే అవకాశం లేదు. (దివ్య ఖుర్ఆన్ 2: 274)

వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమ కంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. (దివ్య ఖుర్ఆన్ 59: 9)

మనకందరికీ అల్లాహ్ మార్గంలో ఎక్కువ సత్కార్యాలు చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక!


తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# మరణానంతరం జీవితం

**- షేఖ్ అబ్దుల్ బాసిత్. కొత్తగూడెం**



"పుట్టినప్పుడు బట్ట కట్టలేదు. పోయే టప్పుడు అది వెంటరాదు." అన్నాడో కవి.

నిజమే కదా.

ఇక్కడ దైవానుగ్రహం పొందినవారు ఈ జీవిత సత్యాన్ని మరచిపోయి పూటకో డ్రెస్ మారుస్తూ మురిసిపోతున్నారు.

లక్షల, కోట్ల విలువ చేసే వాహనాల్లో తిరిగిన వారిని, చివరికి తెల్లటి గుడ్డలో చుట్టి పాడె మీద నలుగురు మోసు కుంటూ తీసుకుని వెళ్లి మట్టిలో పూడ్చి వేస్తారు.

మేడ మిద్దెలలో పట్టే మంచాలపై, మెత్తని పరుపు మీద, చల్లని ఏసీ గదుల్లో నిద్రించిన వారు, ఒంటరిగా చీకటి శ్మశా నంలో మట్టి నేల మీద నిదుర పోతు న్నారు.

ఈ జీవిత సత్యాన్ని మరచిన మనిషి , ఈ మాయా ప్రపంచం వెనుక పరుగులు పెడుతున్నాడు. అందినంత సొంతం చేసుకోవాలని మృత్యువు వచ్చి ముంగిట నిలిచే దాకా అలుపెరుగని పోరాటం చేస్తున్నాడు.

ఇదే విషయాన్ని ఖురాన్‌లో సృష్టికర్త అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు.

"వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహంలోనే) శ్మశానానికి చేరు కుంటారు". (102 : 1-2)

మరోచోట ఇలా అంటున్నాడు

"ధనాన్ని కూడబెట్టి దానిని మాటిమాటికి లెక్కబెట్టి ఉంచే వాడూ అయిన ప్రతి వ్యక్తీ సర్వనాశనమవుతాడు. అతడు తన ధనం తనవద్ద కలకాలం ఉంటుందని అనుకుంటు న్నాడు. అలా ఎన్నటికీ జరగదు" (104:3-4)

ఈ చావు పుట్టుకల నడుమ జీవితం ఎందుకోసమో చెబుతూ ఖురాన్‌లో ఇలా చెప్పబడింది.

మీలో మంచి పనులు చేసేవారు ఎవరో పరీక్షించాలని మేము చావు పుట్టుకను సృష్టించాం అంటున్నాడు, సృష్టి

కర్త అయిన అల్లాహ్.

మరణం తరువాత పనికి వచ్చే పుణ్యకార్యాలు చేయడంలో అలసత్వం ఏమరుపాటులో పడి ఉన్నాడు.

ఈ జీవితమే శాశ్వతం అనే భ్రమలో భోగలాలసాలలో మునిగి తేలుతున్నాడు. మృత్యువు దూత ముంగిట నిలిచిన నాడు పెడబొబ్బలు పెడుతున్నాడు.

"బాగా తెలుసుకోండి. ఈ లౌకిక జీవితం ఒక ఆట, ఒక వినోదం, బాహ్య పటాటోపం, పరస్పరం ప్రగల్భాలు పలకటం, సంపద, సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నించటం తప్ప మరేమీ కాదు." అంటుంది ఖురాన్. (57: 20)

అసలు జీవితం పరలోక జీవితం.

అదే విషయాన్ని సృష్టి కర్త అయిన అల్లాహ్ ఖురాన్‌లో ఇలా సెలవిచ్చాడు.

"మీరు ఐహిక జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి పరలోక జీవితమే మేలైనది,. శాశ్వతమైనది"

"మానవ జీవితం ఒక క్రీడ, ఒక వినోదం తప్ప మరేమీ కాదు, అసలు జీవనగృహం పరలోక గృహమే.

అయ్యో! వారు (ఈ విషయాన్ని) తెలుసుకుంటే ఎంత బాగుంటుంది". అంటుంది ఖురాన్. (29:64)

మనిషిని పరీక్షించడం కోసం ఈ భూమిపై ప్రతిదీ ఆకర్షణీయంగా చేయబడింది.

ఇదే విషయాన్ని ఖురాన్‌లో సృష్టి కర్త అయిన దైవం ఇలా సెలవిచ్చాడు

స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు రాసులూ, మేలుజాతి గుర్రాలూ ఈరోజుల్లో పెద్ద పెద్ద కార్లు, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చెయ్యబడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంప దలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం మరణానంతరం అల్లాహ్ వద్ద ఉన్నదే.

ఈ జీవితం ఒక పరీక్ష అన్న విషయాన్ని మరచిన మనిషి, క్షణభంగురమైనది ఈ ప్రాపంచిక జీవితం అని తెలిసిన, ధర్మాధర్మాలు మరచి, వందల, వేల ఎకరాల భూమిని, కోటాను కోట్ల రూపాయలు కూడబెట్టడం కోసం పరుగులు పెడుతున్నాడు. చివరికి మరణించి మట్టిలో కలిసి పోతున్నారు.

ఈ జీవితం పరీక్ష కోసం ఇవ్వబడింది.

ఎప్పుడూ, ఎక్కడా, ఎలా ముగియనున్నదో తెలియని ఈ క్షణభంగుర ప్రాపంచిక జీవితం కావాలో, మరణానంతరం శాశ్వత పరలోక జీవితం కావాలో మనమే నిర్ణయించుకోవాలి.

"కేవలం ఈ ప్రాపంచిక జీవితాన్నీ, దాని ఆకర్షణలనూ కోరుకునే వారు చేసిన పనులకు పూర్తి ప్రతి ఫలాన్ని మేము వారికి ఇక్కడనే ఇచ్చేస్తాము. ఇందులో వారికి తక్కువ చెయ్యటం అంటూ జరుగదు. అయితే పరలోకంలో అటువంటి వారికి అగ్ని తప్ప మరేమీ ఉండదు. (అక్కడ తెలిసి పోతుంది. వారు ప్రపంచంలో చేసినదంతా మట్టిలో కలసి పోయింది అనీ, వారు చేసినదంతా కేవలం మిథ్యఅనీ. (ఖురాన్ 11 : 15-16).

సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగిన స్థాయికి ఎదిగిన ఓ మనిషి, మృత్యువు నుంచి మాత్రం కాపాడుకోలేవు అన్నది గ్రహించు. మేలుకో.

కాలంతో పాటు కరిగి పోతున్న జీవితాన్ని అర్థం చేసుకో.

జీవిత మర్మమేమిటో తెలుసుకుందాం

లభించిన జీవితాన్ని సార్థకం చేసుకో.

ఇహ పరాలలో సుఖమయ సంతోషకరమైన జీవితాన్ని పొందుదాం. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



\- ముహమ్మద్ ముజాహిద్

# చరిత్ర మరిచిన యోధులు వీరు

**భారత దేశ** చరిత్రలో మహోజ్వల ఘట్టమైన స్వాతంత్ర్యోద్యమం భారతీయుల పోరాట పటిమకు, త్యాగ నిరతికి ఒక నిలువుటద్దం. ఇలాంటి పోరాటంలో దేశంలోని అతి పెద్ద అల్ప సంఖ్యాక వర్గమైన ముస్లింలు తమదైన బాధ్యతాయుత పాత్రను పోషించారు. అపూర్వ త్యాగాలతో పునీతులయ్యారు. అయినా వారి త్యాగమయ చరిత్ర పలు కారణాల వల్ల మరుగున పడిపోయింది. కానీ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే భారత స్వాతంత్ర్య సాధనకు ముస్లింలు చేసిన కృషి ఎంత అమూల్యమైనదో తెలుస్తుంది. కొందరు చరిత్రకారులు, రచయితలు ఈ విషయంలో కృషి చేసి ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల గురించి ప్రపంచానికి తెలియజేశారు.

బ్రిటిషర్ల దురాగతాలను అడ్డుకున్న మొదటి మొనగాడిగా బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌల ప్రఖ్యాతిగాంచాడు. ప్రథమ స్వాతంత్ర్య సమరానికి ముందే బ్రిటీష్ పాలకులకు తొత్తులైన బెంగాల్ జమీందార్లకు వ్యతిరేకంగా 1763లో ముస్లిం ఫకీర్లు మజ్నూషా నేతృత్వంలో తిరుగుబాటు చేశారు. ఇది ఫకీర్లు-సన్యాసుల ఉద్యమంగా ఖ్యాతిగాంచింది. 1820-1870 మధ్య ముస్లిం నాయకుల నేతృత్వంలో వహాబీ ఉద్యమం జరిగింది. టిప్పు సుల్తాన్ బ్రిటిషర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. కానీ స్వదేశీ పాలకులు ఆయనతో కలిసి రాలేదు. “స్వదేశీ పాలకులు టిప్పు మాటను గౌరవించి ఉంటే ఈనాడు ఈ నేల మీద మేం పాలకులుగా ఉండేవాళ్లం కాదు” అని బ్రిటిష్ పాలకులు ప్రకటించారంటే టిప్పు ఎంత గట్టిగా బ్రిటిష్ పాలకులను ఎదిరించాడో అర్థమవుతుంది. ఆ తర్వాత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా ప్రసిద్ధి చెందిన 1857 తిరుగుబాటు కూడా ముస్లిం పాలకుడైన మొఘల్ పాదుషా బహద్దూర్ షా జఫర్ నాయకత్వంలో జరగడం గమనార్హం. ఈ ఉద్యమంలో విక్టోరియా మహారాణి ప్రకటనకు దీటుగా అవధ్‌కు చెందిన బేగం హజరత్ మహల్ భారతీయులను హెచ్చరిస్తూ ఒక ప్రకటన చేశారు. ఆత్మ గౌరవంతో, ధర్మబద్ధంగా ప్రశాంత జీవితం సాగించాలంటే స్వదేశీ పాలన కోసం శత్రువులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టండని ఆమె పిలుపునిచ్చారు. ప్రజల్లో దేశభక్తి భావన పెంపొందించేందుకు పయామే ఆజాది పత్రికను అజీముల్లా ఖాన్ హిందీ, ఉర్దూ భాషల్లో ప్రచురించారు. ఆనాడు బ్రిటీష్ పాలకులను అడుగడుగునా ఎదిరించిన

యోధుల్లో మౌలానా లియాఖత్ అలీ ఖాన్, హిక్మతుల్లా ఖాన్, ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుల సేనాని మహమ్మద్ భక్త్ ఖాన్, షెహజాదా ఫిరోజ్ షా, ఝాన్సీ రాణిని తిరుగుబాటుకు పురి కొల్పిన బక్షీస్ అలీ ప్రధాన పాత్ర పోషించారు. ఆనాటి పోరులో హిందూ- ముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఖాన్ బహద్దూర్ ఖాన్ నిలిచారు.

ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం మహిళలు కూడా అసంఖ్యాకంగా పాల్గొన్నారు. ఇందులో మహిళా సైనిక దళాలు ఏర్పాటు చేసి, నానా సాహెబ్ పక్షాన రణరంగంలో వీర విహారం చేసిన పాతికేళ్ల యువతి అజీజున్ మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో 27 వేల మంది ముస్లిం స్త్రీ, పురుషులను బ్రిటిష్ సైన్యాలు ఉరి తీశాయి, తగుల బెట్టాయి. మరో 30 వేల మందిని ప్రవాస శిక్షలకు గురి చేశాయి. నాటి సంగ్రామాన్ని ఆంగ్లేయాధికారి హెన్నీ మీడ్ ఇస్లామిక్ తిరుగు బాటుగా అభివర్ణించడాన్ని బట్టి ఆనాడు పోరాటంలో ముస్లింలు ఎంతో వీరోచితంగా పోరాడారో మనకు అర్థమవుతుంది.

బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసిన వారిలో తెలంగాణకు ఎందిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ముఖ్యులు. 1857లో ఆయన హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి చేశారు. దీంతో ఆయనపై పగ పెంచుకున్న బ్రిటిష్ పాలకులు అతి కష్టం మీద ఆయనను బంధించి హైదరాబాద్ నడి బొడ్డున ఆయనను ఉరి తీశారు. మరోవైపు విశాఖపట్నం బ్రిటిష్ సైన్యంలో సైనికాధికారిగా పని చేసిన సుబేదార్ అహమ్మద్ కూడా ఆనాటి తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. ఆయనను కూడా బ్రిటిష్ అధికారులు ఫిరంగి గొట్టానికి కట్టి పేల్చేశారు. ఆ తర్వాత భారత జాతీయ కాంగ్రెస్ తొలి రోజుల్లో బద్రుద్దీన్ తయ్యాబ్జీ, రహమతుల్లా సయాని లాంటి ప్రముఖులు కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించి స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. బ్రిటిష్ పాలకులు హిందూ-ముస్లింల మధ్య విభజన తెచ్చి పబ్బం గడుపుకోవాలని ప్రయత్నించినప్పుడు జాతీయోద్యమంలో పాల్గొనడం ముస్లింల విధిగా పేర్కొంటూ ఉలెమాలు కొందరు విస్తృతంగా ఫత్వాలు జారీ చేశారు. నమాజ్ చేయడం ఎంతటి విధో.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటం కూడా అంతే తప్పనిసరి విధిగా మౌలానా ముహమ్మద్ లాంటి వారు పేర్కొన్నారు.

విప్లవ గ్రూపులు బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడిన అగ్ని యుగంగా పిలువబడే కాలంలో గదర్ పార్టీలో డాక్టర్ బర్కతుల్లా, డాక్టర్ మన్సూర్, అబ్దుల్ వహబ్ ప్రధాన పాత్ర పోషించారు. ఆనాడు భారతీయ సైనికుల్లో తిరుగుబాటును ప్రోత్సహిస్తూ గాలిబ్ పాషా లేఖలు రాశారు. ఆ తర్వాత మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారు. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ లాంటి నాయకులు పోరాడారు. వారికి బ్రిటిష్ ప్రభుత్వం విధించిన శిక్షకు నిరసనగా జరిగిన జలియన్ వాలాబాగ్‌లో ప్రజలు సమావేశమయ్యారు. ఆ సమావేశంలో బ్రిటిష్ అధికారులు జరిపిన కాల్పుల్లో 55 మంది ముస్లింలు మరణించారు.

తన దేశంలోని కుక్క పిల్లలు కూడా బ్రిటిష్ బానిస సంకెళ్లలో బందీలుగా ఉండరాదన్నది తన అభిమతమని ఆబాది బేగం బానో గర్జించారు. జాతీయోద్యమంలో చిచ్చరి పిడుగుగా ప్రసిద్ధుడైన హసరత్ మోహాని 1921 నాటి కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వరాజ్యం ప్రతిపాదన ప్రవేశపెట్టారు. మలబార్లో మోప్లాల తిరుగుబాటుకు మౌలీ అలీ ముస్లియార్ నేతృత్వం వహించారు. అష్ఫాఖుల్లా ఖాన్ లాంటి యువకులు హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ లాంటి విప్లవ సంస్థల్లో సభ్యులై బ్రిటిషర్లపై సాయుధ పోరాటం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మన్యం వీరుడు అల్లూరి సీతారామారాజు చేసిన పోరాటానికి డిప్యూటీ కలెక్టర్ ఫజులుల్లా ఖాన్ ప్రేరణగా నిలిచారు.

1927లో సైమన్ కమిటీ గో బ్యాక్ అంటూ ముంబైలో జరిగిన భారీ ప్రదర్శనకు యువ నాయకుడు యూసుఫ్ మెహరాలి నాయకత్వం వహించారు. చిట్టగాంగ్ విప్లవ వీరులకు ముస్లిం యువకులు రక్షణగా ఉంటూ గమ్య స్థానాలకు చేర్చేవారు. 1930లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో సరిహద్దు గాంధీగా ప్రసిద్ధులైన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ తన సోదరుడితో కలిసి అహింసా యోధుల దళాన్ని (రెడ్ షర్ట్స్) ఏర్పాటు చేసి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటానికి చివర్లో ఊపిరి లూదిన క్విట్ ఇండియా ఉద్యమానికి నినాదం అందించిన ఘనత యూసుఫ్ మెహర్ అలీకి దక్కుతుంది. ఇక నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో జనరల్‌గా షానవాజ్, కల్నల్‌గా అజీజ్ అహ్మద్, యం.కె.ఖైనీ ప్రధాన బాధ్యత నిర్వహించారు.

1946 ఫిబ్రవరిలో జరిగిన రాయల్ ఇండియన్ నేవీ తిరుగు బాటులో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వ కాల్పుల్లో మరణించినవారిలో అత్యధికులు ముస్లింలే. 1940 నుంచి 1947లో స్వాతంత్ర్యం వచ్చే వరకు గాంధీజీ, మౌలానా ఆజాద్ ఇద్దరూ జాతీయోద్య మానికి మార్గదర్శకత్వం వహించారని చెప్పవచ్చు. జాతీయవాద ముస్లిం నాయకులు దేశ విభజనను కూడా వ్యతిరేకించారు. ఈ విధంగా భారతీయ ముస్లింలు దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారు. ఇన్నిన్ని త్యాగాలు చేసిన ముస్లిమ్ యోధులను చరిత్ర పుస్తకాల్లో మాత్రం సముచితమైన స్థానం దక్కలేదు.

# పితృస్వామ్య వ్యవస్థ - ఇస్లాం

- ముహమ్మద్ షరీఫ్

**నూతన** నాస్తిక తాత్వికులలో ముందు వరసలోనున్న రిచర్డ్ డాకిన్స్ మతం పితృస్వామ్య వ్యవస్థను స్థాపిస్తుంది. మహిళల హక్కులను కాలరాస్తుంది. కనుక మతాన్ని వ్యతిరేకించాలి అని సూత్రీకరణ చేశాడు. నాస్తిక వాదులందరూ కూడా ఇదే వాదనను సమర్ధిస్తారు. డాకిన్స్ పుస్తకం The God delusionలో సైతం ఇదే వాదనను లేవనెత్తుతాడు. ఇది చాలా ప్రాచుర్యం పొందిన వాదన. దీని నుండే ఫెమినిజం అనే భావన ఉనికిలోకి వచ్చి ఉంటుంది.

వీరి వాదన ప్రకారం ప్రారంభంలో సహజసిద్ధమైన మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది, ఐతే ఆ తర్వాతి కాలంలో మతం ఆవిర్భవించి మాతృస్వామ్య వ్యవస్థను రూపుమాపింది, మతం తన ఫ్యూడల్ స్వభావంతో పురుషాధిక్య భావన పెరిగి మహిళలపై హింస నిత్యకృత్యమైంది అని సూత్రీకరించాడు. నిజానికి ఈ సూత్రీకరణ సత్యదూరమైనది.

**మాతృస్వామ్య వ్యవస్థ గురించి క్రింది విషయాలు గమనించగలరు.**

➢చాలా మంది మానవ శాస్త్రవేత్తలు నిస్సందేహంగా మాతృ స్వామ్యానికి సంబంధించిన సమాజాలు ఏవీ లేవని అభిప్రాయ పడ్డారు.

➢ J. M. అడోవాసియో, ఓల్గా సోఫర్, జేక్ పేజ్ ప్రకారం, అసలు మాతృస్వామ్యం ఉనికిలో ఉన్నట్లు తెలియదు.

➢ ఆంత్రోపాలజిస్ట్ జోన్ బాంబెర్గర్ వాదిస్తూ, చారిత్రక రికార్డులో స్త్రీలు ఆధిపత్యం వహించినట్లుగా ఏ సమాజంలోనూ ప్రాథమిక ఆధారాలు లేవు.

➢ మానవ శాస్త్రవేత్త డోనాల్డ్ బ్రౌన్ తన మానవ సాంస్కృతిక సార్వత్రిక జాబితా (అనగా, దాదాపు అన్ని ప్రస్తుత మానవ సమాజాల ఉమ్మడి లక్షణాలు)లో ప్రజా రాజకీయ వ్యవహారాలలో పురుషులను "ఆధిపత్య శక్తులు"గా చేర్చారు. ఇది ప్రధాన స్రవంతి మానవ శాస్త్రం సమకాలీన అభిప్రాయమని అతను నొక్కిచెప్పాడు.

➢ హవిలాండ్ ప్రకారం, పురుషుల పాలన కంటే ముందు స్త్రీల పాలన అనేది "పంతొమ్మిదవ శతాబ్దపు అనేకమంది మేధావుల కల్పన. ఈ పరికల్పన నేటికీ మనుగడలో ఉంది. చాలా మంది నిపుణులు అది నిజం కాదని చెప్పారు.

➢ మాతృస్వామ్య సమాజానికి స్పష్టమైన ఆధారాలు లేవు.

➢ మాతృస్వామ్యానికి మొదట జోసెఫ్-ఫ్రాంకోయిస్ లాఫిటౌ "గైనేకోక్రటీ" అని పేరు పెట్టారు.

➢ "మాతృస్వామ్యం" అనే పదానికి ధృవీకరణ మొట్టమొదటిగా 1885లో లభించడం గమనార్హం.

➢ 19వ శతాబ్దంలో చాలా మంది మేధావులు చరిత్రలో పురుషుల పాలన కంటే ముందు స్త్రీల పాలన వచ్చిందని విశ్వసించారు.ఐతే దీనికి ఎలాంటి ఆధారాలూ లేవు.

➢ 20వ శతాబ్దంలో, ఈ స్త్రీవాదులు దీన్ని ప్రచారం చేశారు. కానీ నేడు, చాలా మంది నిపుణులు మాతృస్వామ్యం నిజంగా ప్రభుత్వ వ్యవస్థగా ఉనికిలో లేదని నమ్ముతున్నారు.

➢ చైనాలోని మోసువో సంస్కృతి వంటి కొన్ని సమాజాలు తరచుగా మాతృస్వామ్యమైనవిగా వర్ణించబడ్డాయి, ఎందుకంటే మహిళలు తరచుగా కుటుంబానికి నాయకత్వం వహిస్తారు. వ్యాపార నిర్ణయాలు తీసుకుంటారు. అయినప్పటికీ, ఇప్పటికీ ఈ సమాజాలలో రాజకీయ అధికారాలు పురుషులవే.

ఇస్లాంలోని పితృస్వామ్యం మహిళల వెనుకబాటుతనానికి, అణచివేతకి కారణమనే అభిప్రాయాన్ని సాధారణీకరించే ప్రయత్నం జరుగుతుంది. నిజానికి ఇస్లాం మహిళలను అణచివేస్తుందనే ప్రచారం సరైనది కాదు. ఇస్లాం పితృస్వామ్య వ్యవస్థను కలిగి ఉన్నప్పటికీ ఇస్లాం మహిళలను అణచివేయదు. పురుషునికి బాధ్యతతో కూడిన అధికారాన్ని ఇస్తుంది ఇస్లాం. అలాగే ఇస్లాం స్త్రీ, పురుషుల హక్కులు, బాధ్యతలలో సమతుల్యాన్ని సైతం నెలకొల్పుతుంది. అన్నింటి కంటే పితృస్వామ్యం అనేది సహజసిద్ధ భావన. ఇది మానవ సమాజ చరిత్ర ప్రారంభం నుండీ అమలులో ఉంది.

➢ **ఖురాన్‌లో లైంగిక సమానత్వం** : మానవులందరికీ సమాన విలువ ఉందని ఖురాన్ బోధిస్తుంది (49:13). ఇది మహిళలకు విద్య, వారసత్వం, స్వతంత్ర ఆర్థిక లావాదేవీల హక్కులను ఇస్తుంది.

➢ **ఇస్లామీయ చరిత్రలో మహిళల పాత్ర**: మహమ్మద్ ప్రవక్త(స)

కాలంలో పండితులు, నాయకులు సహచరులుగా ఇస్లామీయ చరిత్రలో మహిళలు ముఖ్యమైన పాత్ర పోషించారు.

➢ ఇస్లాం మహిళలకు విద్యను ఆర్జించే, ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనే అధికారాన్ని ఇచ్చింది. ప్రవక్త (స)భార్య హజ్రత్ ఖదీజా (రజి) నాటి మక్కాలో ప్రముఖ వ్యాపారవేత్త అని మనకు తెలుసు.

➢ హజ్రత్ ఆయిషా(రజి) ప్రముఖధార్మికవేత్తగా ప్రవక్త(స) అనుయాయులకు మార్గనిర్దేశన చేశారు.

పై చర్చ ద్వారా ఇస్లాంలోని పితృస్వామ్య వ్యవస్థ మహిళల అణచివేతకు కారణమని చేసే వితండవాదం అర్థరహితమని, ఆధారరహితమని తెలుస్తుంది. నూతన నాస్తికత్వం ప్రాచుర్యం పొందడం కోసం ఇస్లాంపై బురదచల్లడానికి చేసే ప్రయత్నాలే తప్ప ఈవాదనలకు ఏవిధమైన ప్రాధాన్యతా లేదు

# మీ ఆరోగ్యం జాగ్రత్త!

**“మూసా తన నిండు యౌవనదశకు చేరుకున్నప్పుడు, అతని పెరుగుదల పరిపక్వతను సంతరించుకున్నప్పుడు, మేము అతనికి వివేకాన్నీ, జ్ఞానాన్నీ ప్రసాదించాము. మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తూ ఉంటాము.” (దివ్య ఖుర్ఆన్ 28:14)**

**వారి ప్రవక్త వారితో ఇలా అన్నాడు : “మీకు ఏలికగా అల్లాహ్ తాలూత్‌ను నియమించాడు.” ఇది విని వారు ఇలా అన్నారు : “మాపై రాజ్యం చేసే హక్కు అతనికెలా సంక్రమిస్తుంది? రాజ్యం చేసే హక్కూ, అర్హతలూ అతనికంటే మాకే ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే, అతడు శ్రీమంతుడు కాదు.” దానికి సమాధానంగా ప్రవక్త వారితో ఇలా అన్నాడు : “మీకు బదులుగా అల్లాహ్ అతనినే ఎన్నిక చేశాడు. అల్లాహ్ అతనికి బుద్ధిబలాన్నీ, కండబలాన్నీ సమృద్ధిగా ప్రసాదించాడు. తాను కోరిన వారికి తన రాజ్యం ప్రసాదించే అధికారం అల్లాహ్‌కు ఉంది. (దివ్యఖుర్ఆన్ 2:267)**

పరిపాలన చేయాలన్నా, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలన్నా, వ్యక్తిగత లక్ష్యాలైనా, ధార్మిక సేవకైనా, సామాజిక సేవకైనా బుద్ధిబలంతో పాటు కండబలం కూడా అవసరమని ఈ ఖుర్ఆన్ ప్రబోధనల ద్వారా తెలుస్తోంది.

మనిషి ఆరోగ్యంగా ఉంటేనే అతనిలో ఆరోగ్యకరమైన ఆలోచనలు పుడతాయి. ఏదైనా నేర్చుకోగలడు, పదిమందికి నేర్పగలడు. నలుగురుకి సహాయపడగలడు. అనారోగ్యం పాలైతే ఆలోచించే స్థోమత సన్నగిల్లుతుంది. మన సంకల్పాలు బలహీనమవుతాయి. చురుకుదనం మందగిస్తుంది. అందుకే ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) ‘ఆరోగ్యాన్ని అనారోగ్యానికి పూర్వం మేలైనదిగా భావించాల’ని తాకీదు చేశారు. మనిషి జీవితానికి మంచి ఆరోగ్యం, అంగసౌష్టవం, దేహదారుఢ్యం ఎంతో అవసరం. మంచి ఆరోగ్యంతోనే మనిషి చురుగ్గా ఉండగలుతాడు. అప్పుడే మేథస్సులో మంచి ఆలోచనలకు బీజం పడుతుంది. జీవితంలో ఏమి సాధించాలన్నా పరిశ్రమించగలడు. చెమటోడ్చి శక్తియుక్తులన్నీ ధారపోసి తాను అనుకున్నది సాధించుకోగలడు. విజయతీరాలకు చేరేందుకు కఠోరశ్రమను చేయగలడు. ఆరోగ్యవంతులే తన స్వయానికీ, తన ఇంటివారికి చివరికి సమాజానికీ లబ్ధి చేకూర్చ గలుగుతారు. దానికి భిన్నంగా వ్యాధిగ్రస్తుడు, రోగగ్రస్తుడు, బలహీనమైన మనిషి జీవితంలో దేన్నీ సాధించలేడు. చివరికి తమ అవసరాలను తీర్చుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. భౌతిక అవసరాలు తీర్చుకోవడానికి, జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవడానికి ఆరోగ్యం ఎంతటి కీలకపాత్ర పోషిస్తుందో ధార్మిక అవసరాలు తీర్చుకోవడానికి, ధార్మిక ఉన్నతి లోనూ ఆరోగ్యం అంతే కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యంగా చురుగ్గా ఉన్న ముస్లిమే దైవారాధనలను సక్రమంగా నిర్వర్తించగలడు. ధార్మిక కార్యకలాపాలను ఆచరించగలడు. సత్యధర్మ మార్గంలో వచ్చే అవరోధాలను ఎదురించి నిలకడ చూపగలడు. మంచిని పెంచి చెడును నిర్మూలించడంలో వచ్చే కష్టాలను స్థయిర్యంతో ఓర్చుకోగలడు. సమాజ సేవలో, తోటి వారిని ఆదుకోవడంలో చురుగ్గా పాల్గొనగలడు. ఆరోగ్యాన్ని మహా భాగ్యంగా అల్లాహ్ ప్రసాదించిన గొప్ప అనుగ్రహంగా భావించి దాన్ని కాపాడుకోవాలి. దైవమిచ్చిన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఆరోగ్యం కోసం వ్యాయామం చేయడమూ ఆరాధనతో సమానం. ఆరోగ్యం కోసం అల్లాహ్‌ను వేడుకోవాలనీ ప్రవక్త హితవు పలికారు. ఒక వ్యక్తి ముహమ్మద్ ప్రవక్త (స) దగ్గరికి వచ్చి ‘నమాజు తరువాత నేను అల్లాహ్ ను ఏమని కోరుకోవాలి?’ అని అడిగాడు. దానికి ఆయన(స) ‘ఆరోగ్యంతో క్షేమంగా ఉండాలని’ కోరుకో అని అన్నారు. మరో సందర్భంలో ‘ఓ అల్లాహ్ నీ కారుణ్యంతో ఆరోగ్యాన్ని, క్షేమాన్ని ప్రసాదించు’ అని వేడుకోమన్నారు.

**- ముహమ్మద్ అమ్మార్**

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

53 – 56 అతను తన జాతిని తేలికయినదిగా భావించాడు, వారు అతని విధేయులయి మెలిగారు, వాస్తవానికి వారు పాపాతురులయిన జనులు.[50] చివరికి వారు మమ్మల్ని ఆగ్రహోపేతులు చేయగా మేము వారి ఎడల ప్రతీకారం తీర్చుకున్నాము. వారిని మూకుమ్మడిగా ముంచివేశాము, తరువాతి తరాలకు ముమ్మందు పోయేవారుగా, గుణపాఠం గరిపే ఉదాహరణగా చేసి పెట్టాము.[51]

57 – 58 మర్యమ్ సుతుని ఉదాహరణ ఇవ్వగానే నీ జాతి ప్రజలు దాని మీద ఎంతో అల్లరి చేశారు, మా ఆరాధ్య దైవాలు బాగున్నాయా లేదా అతనా?[52] అనసాగారు. ఈ ఉదాహరణను వీరు నీ ముందు కేవలం కుతర్కంగా తీసుకు వచ్చారు, వాస్తవానికి వీరే జగడాలమారి జనులు.

50. ఈ అతి చిన్న వాక్యంలో ఒక పెద్ద వాస్తవాన్ని తెలుపడం జరిగింది. ఒక దేశంలో ఎవరయినా వ్యక్తి తన నిరంకుశత్వం కొనసాగించే ప్రయత్నం చేసినట్లయితే దానిగ్గాను విచ్చలవిడిగా అన్ని విధాల ఎత్తుగడలూ వేస్తాడు. అన్ని రకాల వంచనలు, మోసాలు, దగా ప్రయోగిస్తాడు. బహిరంగ బజారులో అంత రాత్మల క్రయవిక్రయాల వ్యాపారం నడుపుతాడు. అమ్మకానికి అందనివారిని క్రూరంగా అణచివేస్తాడు, కాలరాస్తాడు. తాను నోటితో ఈ మాట పలకకపోయినా, ఆచరణ ద్వారా స్పష్టంగా దీన్ని చేసిచూపిస్తాడు, తాను ఈ దేశవాసుల్ని బుద్ధి రీత్యాను, నైతికత రీత్యాను, ధైర్యసాహసాల రీత్యాను, చాలా తేలికయిన వారుగా పరిగణిస్తానని చాటుతాడు. ఈ బుద్ధిహీనులు, అంత రాత్మ హీనులు, పిరికివారయిన జనుల్ని ఎటుదలిస్తే అటే త్రిప్పుకుని తీసుకుపోగలనని తాను భావిస్తున్నట్లు ప్రకటిస్తాడు. తన ఈ ఉపాయాలన్నీ ఫలవంతమయినప్పుడు, దేశవాసులు అతని కట్టు బానిసలుగా చేతులు కట్టుకు నిలబడినప్పుడు వారు తమ ఆచరణ ద్వారా కూడా రుజువు పరుస్తారు.ఆ దుష్టుడు తమను గురించి ఎలా భావించాడో తాము వాస్తవంగా అలాంటి వారేనని నిరూపిస్తారు. వారు ఈ హీనదశకు లోనయ్యేందుకు అసలు కారణం, వారు మూలతః పాపాతురులయి ఉండటం. వారికి, సత్యం ఏదో, మిథ్య ఏదో అన్న వాదన అక్కర లేదు. న్యాయం, అన్యాయాలేవో అవసరం లేదు, నిజాయితీ, నీతి, సౌజన్యతలు విలువయినవా లేదా అబద్ధం, అవినీతి, నైచ్యం లాంటివా అన్నదీ వారు పట్టించుకోరు. ఈ విషయాలకన్నా అసలు ప్రాముఖ్యత వారి వద్ద తమ స్వంత ప్రయోజనాలకే ప్రాప్తమయి ఉంటుంది. దానికి వారు ప్రతి అన్యాయానికి తోడ్పాటు అందజేయడానికి, ప్రతి దుర్మార్గునికి, అత్యాచారునికి అణగిపోవడానికి, ప్రతి మిథ్యావాదాన్ని స్వీకరించడానికి ప్రతి సత్య సందేశాన్ని అణచడానికి సన్నద్ధులయిపోతారు.

51. అంటే, ఎవరయితే వీరి అంతిమ పరిణామం ద్వారా పాఠం గ్రహించరో, వీరి వైఖరినే అవలంబిస్తారో వారి కొరకు వీరు పూర్వపువారు. మరెవరయితే గుణపాఠం గ్రహించేవారు న్నారో వారికి గుణపాఠం కలిగే ఉదాహరణలు వీరు.

52. ఇంతకుముందు 45వ ఆయత్‌లో ఈ విషయాన్ని పేర్కొనడం జరిగింది, "నీకు పూర్వం మేము పంపించిన ప్రవక్తలనందరినీ అడిగి చూడు, కరుణామయుడయిన దైవం తప్ప మరే ఆరాధ్యులనయినా ఆరాధించాలని మేమేమన్నా నియమించామేమో?" ఈ ప్రసంగం మక్కావాసుల సమ క్షంలో జరుగుతున్నప్పుడు ఒక వ్యక్తి–ఉల్లేఖనాల్లో అతని పేరు 'అబ్దుల్లా ఇబ్నుజ్జిబా'రా' అని వచ్చింది – ఈ అభ్యంతరం నాటాడు, 'అదేమిటండి, క్రైస్తవులు మర్యమ్ కుమారుడు ఈసాను దేవుని కుమారుడుగా ఎంచి ఇతని ఆరాధన చేస్తు న్నారా లేదా? అలాంటప్పుడు మా ఆరాధ్యులలో వచ్చిన చెరుపు ఏమిటీ?' దీనికి తిరస్కారుల కూటమి నుండి బిగ్గరగా ఒక వికటాట్టహాసం ఉవ్వెత్తున లేచింది. నినాదాలు బయలు దేరాయి. పట్టేశాము, ఇక తప్పించుకోండి, చెప్పండి దీనికి సమాధానమేమిటో. కాని వారి ఈ పోకిరి చేష్టకు ప్రసంగ క్రమాన్ని తెంచకుండా, సాగుతున్న విషయాన్ని ముందు పూర్తి చేయడం జరిగింది. తరువాత లేవనెత్తిన అభ్యంతరంలోని ప్రశ్న పట్ల శ్రద్ధచూపడం జరిగింది.

(ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వ్యాఖ్యాన గ్రంథాల్లో విభిన్న రీతుల్లో ఉల్లేఖించబడి ఉన్నాయి. వాటిలో చాలా వ్యత్యాసాలున్నాయి. కాని ఆయత్ పూర్వాపరాలను, ఆ ఉల్లేఖనాలనూ పరిశీలిస్తే తేలేదాన్నిబట్టి సంఘటన జరిగిన తీరు మా దృష్టిలో మేము ఇక్కడ వివరించిందే సరయినది).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం
(కితాబుల్ మగాజీ)

## బద్ర్ సమర విశేషాలు

**590)** హజ్రత్ అబూజర్(రజి) కథనం: అల్ హజ్జ్ సూరాలోని "ఆ ఇరు వర్గాల వారు ప్రభువు విషయంలో పోరాడారు" **(22: 19)** అనే ఆయత్ ఆరుగురు వ్యక్తుల గురించి అవతరించింది. వారిలో ముగ్గురు (ముస్లింల పక్షాన) అలీ, హమ్జా, ఉబైదా బిన్ హారిస్. మరో ముగ్గురు (సత్య తిరస్కారుల తరఫున) షైబా బిన్ రబీయ, ఉతబా బిన్ రబీయ, వలీద్ బిన్ ఉతబా.

**599)** అబూ తల్హా (రజి) తమతో ఇలా అన్నారని అనస్ బిన్ మాలిక్(రజి) తెలియజేశారు: బద్ర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (స) ఆదేశానుసారం యుద్ధంలో హతులైన **24** మంది ఖురైషు సర్దారుల శవాలు లోతైన ఒక చీకటి బావిలో పడవెయ్య బడ్డాయి. సాధారణంగా ప్రవక్త మహనీయులు(స) శత్రువుపై విజయం సాధించిన మీదట యుద్ధ రంగంలో మూడు దివా రాత్రులు ఆగి ఉండేవారు. బద్ర్ యుద్ధం ముగిసిన మూడవ రోజు ఆయన(స) ఆజ్ఞపై ఒంటెను సిద్ధం చేయటం జరిగింది. ఆయన(స) బయలుదేరగానే సహచరమాన్యులు కూడా ఆయన వెంట బయలు దేరారు. బహుశా ఆయన ఏదో పనిమీద వెళుతున్నారని సహచరులు తలపోశారు. కాని ఆయన(స) ఆ బావి ప్రక్కన వచ్చి నిలబడి, 'యుద్ధంలో హతులైన ఖురైషు సర్దారుల పేర్లను వారి తండ్రుల పేర్లతో సహా, "ఓ ఫలానా కుమారుడగు ఫలానా వ్యక్తీ! ఓ ఫలానా పుత్రుడగు ఫలానా వాడా! చెప్పండి, మీరు ప్రపంచంలో దైవానికి, దైవప్రవక్తకు విధేయత చూపి ఉంటే ఈ రోజు మీకు శుభకరం అయి ఉండేది కాదా!? నిశ్చయంగా మా ప్రభువు మాకు చేసిన వాగ్దానం సర్వవిధాలా నెరవేరింది. మరైతే మీ ప్రభువు మీకు చేసిన (శిక్షా) వాగ్దానం మీ పాలిట పూర్తిగా నెరవేరిందా?" అని అడిగారు. అబూతల్హా (రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త(స) వేసిన ప్రశ్నపై ఉమర్(రజి) స్పందిస్తూ, 'దైవప్రవక్తా! తమరు ప్రాణం లేని ఈ శవాలను ఎందుకు సంబోధిస్తున్నారు?' అని అడగ్గా, "ఏ శక్తిమంతుని చేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా! నేను చెప్పేదంతా వారు మీకన్నా బాగా వింటున్నార"ని దైవప్రవక్త(స) చెప్పారు. ఖతాదా ఇలా అన్నారు: అల్లాహ్ వారిని ఆ సమయంలో బ్రతికించాడు. దైవప్రవక్త(స) ఆ సత్య తిరస్కారులకు తన మాటను వినిపించడానికి, వారిని హెచ్చరించడానికి, అవమానపరచడానికి, ప్రతీకారం తీర్చుకోవడానికి, విచారపడేలా చేయడానికి, సిగ్గుతో కుంచించుకుపోయేలా చేయడానికి ఇలా చేయటం జరిగింది.[1]

599-1. ఈ సంఘటన ఆధారంగా మృతులు వింటారని ఎవరయినా భావిస్తే లేదా నిరూపిస్తే వారు పొరబడినట్లే. ఎందుకంటే వినిపించే ఈ సంఘటన దైవప్రవక్త(స)కు ప్రత్యేకం. ఇది ఆయన(స) అద్భుతాలలోని ఒక అద్భుతం అని మరువరాదు. వేరొక ఆయత్‌లో చాలా స్పష్టంగా ఇలా సెలవీయబడింది : "(ప్రవక్తా!) సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించ లేవు" (35:22). మరణించిన వెంటనే ప్రపంచంతో మనిషికి ఉండే సంబంధాలన్నీ తెగిపోతాయి. 'వినటం' కూడా ఇందులోనికే వస్తుంది. సజ్జనులైనవారికి దేవుడు 'ఆలమె బర్జఖ్' (బర్జఖ్ అవస్థ)లో ఏదయినా వినిపిస్తే అది వేరే విషయం. దీనితో మృతుల వినికిడికి ఎలాంటి సంబంధం లేదు.

★★★

# దైవ మార్గబోధన- సంపూర్ణ నివారిణి

- ఎస్.ఎమ్.మలిక్

**[2013 జనవరి 11-15 తేదీలలో 'స్ప్రింగ్ ఆఫ్ ఇస్లామ్' (ఇస్లామ్ వసంతం) ప్రధానాంశం ఆధారంగా జమాఅతె ఇస్లామీ హింద్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన మహాసభలో నేను తెలుగులో ప్రసంగించటానికి వ్రాసుకున్న పాయింట్ల ఆధారంగా ఇప్పుడు వ్రాసిన వ్యాసం ఇది]**

ఈ విషయాన్ని విశ్లేషిస్తే ముక్తసరిగా- మానవుడు రోగగ్రస్తుడయి పోయాడు, అందుకే నివారణోపాయాన్ని అన్వేషిస్తున్నాడు. అయితే మానవునికి ఇలా బాధ పెడుతున్న, పట్టి పీడిస్తున్న ఆ రోగా లేమిటి? కాస్త పరికించినా వ్యక్తమయ్యే రోగాలు శారీరకమయినవి ఎన్నో ఉన్నా వాటికి వైద్యులు ఏవో చికిత్సలు చేస్తూనే ఉన్నారు, అవి పీడిస్తూనే ఉన్నా మానవుడు ప్రపంచంలో ఎల్లెడలా ఏ జాడ్యాలకు రుగ్మతలకు గురయి ఉన్నాడో వాటి నివారణకు దారిచూపే వైద్యులే మనిషికి కానరావడం లేదు. అవి మానసిక మయినవి, నైతికమయినవి, ఆంతర్యానికి సంబంధించినవి. ఈ రెండవ రకం రోగాలకే మనిషి సర్వ సాధారణంగా తల్లడిల్లి పోతున్నాడు. వాటికే నివారణోపాయం కనుచూపు మేరలో మనిషికి కానరాకుండా పోతోంది.

నేడు ప్రపంచం ఓ గ్రామమయిపోయిందని విరివిగా వినవస్తోంది. అంటే ప్రపంచంలో ప్రతి భాగం, ఏ మూలనయినా, మరో భాగానికి అద్దం పట్టే పరిస్థితులు వచ్చేశాయన్నమాట. మనిషి రెండు అంగల్లో ఓ మూల నుండి మరో మూలకు వెళ్ళగలగటం అటుంచి, ఓ మూలన కూర్చుని మరో మూలను దర్శించే వ్యవస్థలో శ్వాస పీలుస్తున్నాడన్నమాట! ఈ ఆధునిక మానవుడు వైజ్ఞానికంగా ఎంత ఎదిగినా జీవితం ఎందుకు ఇలా రోగగ్రస్తమయిపోయింది? మనిషి తన్ను గురించి కొన్ని యథార్థాలను విస్మరించాడు.

### యథార్థాలు!

అథమంగా కొన్ని యథార్థాలను సదా దృష్టిలో ఉంచుకోవడం అవసరం. 1) మనిషి వ్యక్తిగతంగా, ప్రకృతి, ప్రవృత్తుల రీత్యా స్వార్థప్రియుడు. తనను మించిన ధర్మం లేదని సహజంగా భావిస్తాడు. ఆ విధంగా కాంక్షాప్రియుడుగా మారడం మనిషికి అతి సులువు. ఈ ప్రవృత్తిని పెంచి పోషించే అంశాలు నేటి రోజుల్లో మరీ పెచ్చరిల్లి తారస్థాయికి చేరాయనడం కన్నా అవి మనిషిని చుట్టుముట్టి అతని మీద తమ అధికారం చెలాయిస్తున్నాయ నడంలో సందేహమే లేదు. అవి మీడియా, టీవీ, సినిమా రూపంలో మనిషిలోని కాంక్షా ప్రియత్వ పిశాచాన్ని అనుక్షణం చెడు వైపునకు పురికొలుపుతూ ఉంటాయి. ఫలితంగా మానవుల నేటి సమాజంలో అశ్లీలత, మితిమీరిన ఉదారవాదం (permissiveness) వంటి జాడ్యాలు వ్రేళ్ళూని సమాజాన్ని లోలోనే గుల్ల చేస్తున్నాయి. కుటుంబ వ్యవస్థ విచ్ఛిత్తికి దారి తీశాయి. జంతువుల్ని సయితం సిగ్గిల్లజేసే జుగుప్సాకరమయిన ఘటనలకు, వాటి ప్రచారానికి మార్గం సుగమం చేశాయి. ఇదంతా ఓ చక్ర భ్రమణం. మీడియా ద్వారా రోగాల పెంపుదల తిరిగి వాటి ప్రచారం ద్వారా రోగాల సర్వ వ్యాప్తి! సాదాసీదా సామాన్య మనిషి అమాయకంగా వీటికి బలి అయిపోతున్నాడు.

ఒక్క స్వార్థం మూలంగా వంచన, అవినీతి, కాంక్షాప్రియత్వం ఇత్యాదివి ప్రతి కుటుంబాన్ని, కుటుంబ వ్యవస్థను, సోదర సోదరీల మధ్య, తల్లిదండ్రులు, సంతానం మధ్య, భార్యాభర్తల మధ్య ప్రేమానుబంధాలను త్రెంచివేసి, పరస్పరం దోపిడికి, చంపుకు తినేవరకు వెగటును, విద్వేషాన్ని, వైషమ్యాన్ని పెంచి వేస్తున్నాయి. అలాగే సమాజంలో వ్యక్తులు, సామాజిక వ్యవస్థలు, సంస్థలు, పరిపాలనా వ్యవస్థలు, రాజకీయ వ్యవస్థలు- సర్వత్రా బాహాటంగానే ఈ విచ్ఛిత్తి దర్శనమిస్తోంది.

ఈ రోగాల నివారణ కొరకు సంఘ సంస్కర్తలు, రాజకీయ నాయకులు, సమాజ సేవకులు, ధార్మిక గురువులు, సంస్థలు, అందరూ శాయశక్తులా తమకు తోచిన రీతిలో నివారణోపాయాలు సూచిస్తున్నారు, ప్రయత్నాలు సయితం చేస్తున్నారు. అయినా పరిస్థితులు- చికిత్స చేసిన కొద్దీ రోగం ముదిరిపోతూనే ఉంది అన్నట్టు రూపుదాల్చాయి. చట్టాలు చేయాలని, నేరస్తుల్ని శిక్షించాలని ప్రతిపాదించే వారి సూచనల మేరకు చట్టాలు చేయడం, శిక్షించడం, యధావిధిగా జరుగుతూనే ఉంది. ఇదంతా ఏ స్థాయిలో జరుగుతూ ఉందో అంతకన్నా పెద్ద స్థాయిలో సామాజిక, వైయక్తిక రుగ్మతలు దినదినాభివృద్ధి చెందుతూనే ఉన్నాయి.

## ఇరువయ్యో శతాబ్ది

ఈ సందర్భంలో ప్రసిద్ధ మలయాళీ కవయిత్రి శ్రీమతి కమలా మాధవి, సురయ్యా, తన అనుభవాలు, సామాజిక అధ్యయనం పరిపక్వత చెందిన తరువాత ఇరువయ్యో శతాబ్దాన్ని గురించి వెలిబుచ్చిన అభిప్రాయాన్ని పేర్కొనడం సబబుగానే తోస్తోంది. ఆవిడ ఆ శతాబ్దిలో మూడు అతి ముఖ్యమయిన సంఘటనలు జరిగాయని అంటున్నారు. ఆమె ప్రకారం ఒకటి, హిట్లర్ ఆవిర్భావం. అది జాత్యహంకారానికి, మానవుల మధ్య తారతమ్య భావానికి, మానవాళి మధ్య విభజనకు ప్రారంభోత్సవం జరిపింది. ఇది మానవాళి విభజనకు ప్రతీక. రెండు, ఆటం విస్ఫోటనం, ఇది వైజ్ఞానిక ప్రభంజనానికి, టెక్నాలజీ విస్తృతి ద్వారా, మానవ కళ్యాణానికి ఉపయుక్తమవవలసిన విజ్ఞానం వినాశ హేతువుగా మారింది. అది మానవత వినాశానికి సంకేతం.

మూడు, గర్భస్రావం చట్టబద్ధమవడం. ఇది లైంగిక అరాచకానికి, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నానికి, ఫలితంగా సమాజ విచ్ఛిత్తికి, పరిసమాప్తికి మూలాంకురం.

కమలా సురయ్యా చేసిన ఈ విశ్లేషణను ఇంకా అనేక విశ్లేషణలు జోడించి యథాతథంగా స్వీకరించవచ్చు.

మనిషి ఈ రుగ్మతల నుండి తన్ను తాను కాపాడుకునేందుకు ఏవో కొన్ని సులభమయిన, తన బుద్ధిజ్ఞానాలకు ప్రాప్తమయిన మార్గాలను అనుసరిస్తాడు, ఫలితంగా ఏదో కొంత ఉపశమనం పొందడం కూడా సాధ్యమే. అవి మనిషిని సరిదిద్దినట్లు బాహ్యంలో అగుపించినా, రోగాలు అసలు సమసిపోవు.

మనిషిని ఆవహించిన రోగాలు బాహ్యాపరమయినవి కావు. అవి అతని మనోమయ జగత్తుకు, అంతరాళానికి సంబంధించిన పీడలు. అంతరాళంలో, మనోజగత్తులో పరివర్తన కలగనిదే ఈ రోగాలు ఎన్నటికీ సమసిపోవు. మనిషిని పట్టి పీడిస్తున్న దోషాలు, రుగ్మతలు మనిషి ఆంతర్యంలోని వ్యక్తిత్వానికి, అతని ఆత్మకు సంబంధించినవి. చికిత్స కూడా అక్కడే జరగాలి. అప్పుడే మనిషి స్వస్థత సాధించగలుగుతాడు. నేడు మనిషి శాశ్వతంగా, పరిపూర్ణంగా ఈ రోగాల నుండి సురక్షితంగా జీవించగలగాలంటే, సమాజంలో శాంతిసుఖాలు పరిఢవిల్లాలంటే, ఆంతర్యం స్వస్థత సాధించాలంటే చట్టాలు, శాసనాలు, మనిషి అంతర్బాహ్యాలను పరిశుద్ధపరచి అతన్నీ, అతని వాతావరణాన్ని మార్చజాలవు. దీనంతటికీ చికిత్స వేరే రూపంలో జరగాలి.

## మతం పాత్ర

ఆంతర్యాన్ని సంబోధించేది ఆధ్యాత్మికత- మతం, ధర్మం.

మతం అన్నది మానవాళి గడించిన అనుభవాలు, విజ్ఞానం, బౌద్ధిక ప్రగతీ వికాసాల ఆధారంగా ఉత్పన్నమయ్యేది. అలా మనిషి కల్పించుకున్న ఆధ్యాత్మిక చింతన, అనుభవాలసారం ఖచ్చితంగా పరిమితమయినదే కాగలదు. మానవుణ్ణి ఆద్యంతం ఎరిగిన వ్యక్తిత్వం, శక్తి, మానవ ప్రకృతి రహస్యాలు తెలిసిన అస్తిత్వం మాత్రమే సరయిన ఆధ్యాత్మిక మార్గాన్ని సూచించ గలదు. ఆ శక్తినే, ఆ అస్తిత్వాన్నే మనం దైవం అని అంటాము. మనిషికి అత్యంతావశ్యకమయిన ఈ మతాన్నీ, ధర్మాన్ని, ఆధ్యాత్మిక మార్గాన్ని- ఆ దైవమే, సృష్టికర్తే సూచించగలడు. ఆయనకే మనిషి అంతర్బాహ్య నిర్మాణమేమిటో, మనిషి అవసరాలేమిటో సరిగ్గా తెలుసు. అందువల్ల మనిషికి అవసరమయిన మతాన్నీ, ధర్మాన్నీ, ఆధ్యాత్మిక మార్గాన్నీ ఆయనే చూపగలడు. ఆయన ఆమోదించిన మార్గం మాత్రమే సరయినది, నిజమయినది. అదే నిజ దైవమార్గ బోధన.

## సమగ్రమయినదే ధర్మం!

మనిషికి అత్యంతావశ్యకమయిన ఈ ఆధ్యాత్మిక మార్గం కేవలం మనిషిని మానసికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా మాత్రమే


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ప్రక్షాళించేది కాదు, అది పూర్తిగా మనిషి అంతర్ బాహ్యాలను పరిశుద్ధ పరిచేది, అటు ఆధ్యాత్మిక అవసరాలను తీర్చేది మాత్రమే కాక మానవుని భౌతిక అవసరాలకు కూడా మార్గం చూపేది కాగలగాలి. మనిషి ఆధ్యాత్మిక అవసరాలను మతం లేదా ధర్మం ద్వారా తీర్చుకుని తన భౌతిక అవసరాల కొరకు మానవ కల్పిత మార్గాలను అనుసరించినట్లయితే మనిషి జీవితం ద్వంద్వ వైఖరికి గురవుతుంది. అతని భౌతిక జీవితం ఆధ్యాత్మిక అవసరాలను ఖాతరు చేయకుండా మనిషిని క్రమేణా భౌతిక వాదిగా మార్చడమో లేదా ఆధ్యాత్మిక విధానాలు ఆధిక్యతనొంది ప్రపంచాన్ని వీడి కేవలం ఆధ్యాత్మిక వికాసాన్ని సాధించేందుకు సన్యాసిగానో బైరాగిగానో మనిషి మారే పరిస్థితి ఏర్పడుతుంది.

అందువల్ల మానవ అవసరాలన్నింటినీ బాగా ఎరిగిన స్వామి మానవ సృష్టికర్త, దైవం ప్రసాదించే మతం లేదా ధర్మమయితే అది అటు ఆధ్యాత్మిక అవసరాలను, ఇటు భౌతిక అవసరాలనూ తీర్చేదిగా ఉంటుంది. అది మనిషి వ్యక్తిగత సమస్యల్ని, కుటుంబ వ్యవహారాలను, సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలను ఆవరించిన ఓ సమగ్ర విధానాన్ని, వ్యవస్థను బోధించే మార్గమయి ఉంటుంది. అదే నిజమయిన మతం లేదా ధర్మం.

అది సంపూర్ణమయిన, సమగ్రమయిన, సర్వ వ్యాపకమయిన, మనిషి అంతర్ బాహ్యాలను సంస్కరించేదయి, మనిషికి నిజ మార్గం, రుజుమార్గం చూపేదయి ఉంటుంది. అటువంటి ధర్మమే మనిషి వ్యాధులన్నింటికీ సంపూర్ణ నివారిణి కాగలదు.

## అటువంటి సమగ్ర సంపూర్ణ మార్గబోధనే దివ్య కుర్ఆన్!

**"ఇది దైవగ్రంథం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. (ఇందులో సందేహాస్పదమయిన విషయం ఏదీ లేదు). ఇది దైవభీతి పరులకు మార్గబోధన. వారు అజ్ఞాత విషయాలను (దైవాన్నీ, పరలోకాన్నీ) విశ్వసిస్తారు. నమాజ్‌ని నెలకొలుపు తారు. మేము (దైవం) వారికి అనుగ్రహించిన జీవికలో నుంచి అవసరార్థుల కొరకు ఖర్చుపెడతారు. నీకు (ఓ ముహమ్మద్!) అవతరించిన దాన్ని (గ్రంథాన్నీ, కుర్ఆన్‌ని), నీకు పూర్వం అవతరించిన (గ్రంథాలను) వాటినన్నింటినీ విశ్వసిస్తారు. పరలోకాన్ని విశ్వసిస్తారు, ఇటువంటి వారు తమ ప్రభువు పక్షాన పంపబడిన రుజుమార్గాన ఉన్నారు. వీరే సాఫల్యాన్ని పొందేవారు." (దివ్య కుర్ఆన్, అల్ బఖర 2: 2-5)**

ఇలా దివ్య కుర్ఆన్ ప్రారంభ వచనాలలోనే తన పరిచయాన్ని ప్రస్ఫుటపరుస్తుంది- అది దైవగ్రంథమని, అది సందేహ రహితమయినదనీను. ఇంకా మరో చోట,

## ఇస్లామ్ అంటే...

"దైవ సన్నిధిలో ఆమోదం పొందిన ధర్మం, దైవవిధేయతా ధర్మం- ఇస్లామ్" (ఆలె ఇమ్రాన్ 3: 19) అని ఇస్లామ్ అన్నది, ప్రారంభ వచనాల్లో పేర్కొన్న విశ్వాస అంశాలు, దేవుని ఏకత్వం, దైవ దౌత్యం (ప్రవక్త), పరలోకం- ఈ మూడు విశ్వాసాల సంచయనమే ఇస్లామ్ అని ఈ గ్రంథంలో అనేకచోట్ల విశదపరచడం జరిగింది. దీనంతటిని బట్టి ఇది దైవగ్రంథమని, దీని రచయిత స్వయంగా దైవం, సృష్టి యావత్తుకు కర్త, స్వామి, ప్రభువు, ఆరాధ్యుడు, కానరాని దైవం మాత్రమే అని, ఆయన సన్నిధిలో ఆమోద యోగ్య మయినది కేవలం ఆయనకు విధేయత తెలిపే ధర్మం ఇస్లామ్ ఒక్కటే అని కూడా ద్యోతకమవుతుంది.

ఈ గ్రంథంలో మరోచోట, ఈ గ్రంథాన్ని గురించి ఇలా కూడా ప్రకటించడం జరిగింది.

**"ఇది సకల మానవాళి కొరకు సవివరమయిన హెచ్చరిక, దైవానికి భయపడి జీవించే వారి కొరకు మార్గదర్శకం, సుబోధనం, ఉపదేశం" (ఆలె ఇమ్రాన్ 3: 138)**

కుర్ఆన్ మానవ జీవితానికి అవసరమయిన సంపూర్ణ, సమగ్ర మార్గదర్శకావళి అని ప్రకటించడం అంటే భావం ఏమిటి? దివ్య కుర్ఆన్‌లో ఇలా ప్రకటించడం జరిగింది :

**"నేను (దైవం) జిన్నుల్ని, మానవుల్నీ, కేవలం నా దాస్యం (విధేయత, ఆజ్ఞాపాలన) చేయడానికి తప్ప మరి దేనికీ సృష్టించలేదు." (అజ్ జారియాత్ 51: 56)**

దైవం, మానవుల్నీ, జిన్నులనబడే మరో సృష్టిరాశినీ, స్వేచ్ఛాయుత సృష్టిగా సృష్టించాడు. వీరు ఇష్టమయితే సృష్టికర్త అయిన ఒకే దైవాన్నీ ఆరాధిస్తూ, ఆయనకే విధేయత చూపగలరు లేదా తిరుగుబాటు వైఖరినవలంబించి బహు దైవారాధనకు పాల్పడి, అనేక అధికార సత్తా గలవారికి విధేయత చూపి దైవాగ్రహానికి పాత్రులూ కాగలరు. లేదా సృష్టి పరమార్థాన్ని గ్రహించి ఒకే దైవాన్ని ఆరాధించి, ఆయనకే విధేయులయి జీవితం గడిపి ఇహపరాలలో సాఫల్యాన్ని సాధించడంతోపాటు పరలోక శాశ్వత సుఖ సంతోషాలకు అర్హతనూ పొందగలరు.

**(ఇంకా వుంది)**

భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా...

# సౌమనస్యం ముద్దు వైమనస్యం వద్దు

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

ప్రజలు సహజంగా శాంతికాముకులు. వారు శాంతిని, మనశ్శాంతిని, ద్వేషరహిత, అణ్వస్త్ర రహిత శాంతినే కోరుకుంటారు. అందుకే శాంతి అనేది మనుజ జాతి మనుగడతో ముడిపడి ఉన్న అవిభాజ్యాంశం అయింది నాటి నుంటి నేటి వరకు. తగాదాలను చిలికి, చిలికి గాలి వానగా చేసుకొని పరస్పర విధ్వంసానికి దారి తీసే పశు ప్రవృత్తిని శాంత స్వభావులు ఎవ్వరూ ఇష్టపడరు. కాబట్టి సుహృద్భావాన్ని పెంపొందించి సామరస్యాన్ని సాధించుకునే దిశగా మనిషి పురోగమించాలి.

నిఖిల జగుత్తుకు నిర్వహణకర్త, పోలిక, సహవర్తులు, సమానులు లేని ఆ సర్వేశ్వరుడైన అల్లాహ్ సెలవిచ్చినట్లు "వ జఅల్నాకుమ్ షుఊబంవ్ వ ఖబాయిల లి తఆరఫూ" (మేము మిమ్మల్ని మీ పరస్పర పరిచయం నిమిత్తం వర్గాలుగా, తెగలుగా చేశాము)– ఒక ప్రాంత సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జీవన సరళి, శైలిని మరో ప్రాంత ప్రజలు చారిత్రక, సామాజిక, నైతిక నేపథ్యంలో తమ దృక్కోణం నుంచి కాక, వారి దృక్పథం ద్వారా అర్థం చేసుకోవాల్సిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉంది.

భాష బలమైన అనుసంధానకర్త, భావప్రకటన ఆయువు వంటిది. కాబట్టి ఆయా రాష్ట్రాలలో కనీసం ప్రభుత్వామోదం పొందిన భాషల్ని నేర్చుకోవడం ఎంతైనా అవసరం. ఎందుకంటే వందల సంవత్సరాలు ప్రక్క ప్రక్కనే నివసిస్తూ ఒకరు ఇంకొకరి భాషను మాట్లాడకపోవడం అనేది ఒకవిధంగా వేర్పాటు ధోరణికి అంకురార్పణం కాగలదన్న వాస్తవాన్ని గ్రహించాలి.

ఏ సమాజ పురోగమనంలోనైనా, తిరోగమనంలోనైనా యువకుల పాత్ర విస్మరించరానిది. కాబట్టి వారి పాఠ్య పుస్తకాలలో మతతత్వ ప్రచారంగాని, మత వ్యతిరేక ప్రచారంగానీ ఉండకూడదు. అన్ని మతాలకు సంబంధించిన వారి పిల్లలు ఉన్న పాఠశాలలో కేవలం ఒక మత బోధ జరిపితే, కొందరిని ప్రోత్సహించి, కొందరిలో అసంతృప్త జ్వాలలను రగిలించిన వారమవుతాము. అలాగే, నగరాల్లో, పట్టణాల్లో, పల్లెల్లో అన్ని వర్గాల యువకులను తరచూ కలిపే క్రీడా కార్యక్రమాలు విస్తృతంగా జరగాలి. ఒక మతస్తులు ఒక చోట, వేరొక మతస్తులు మరొక చోట ఆడుకునే దోష సంస్కృతి పోవాలి. గత 70 ఏండ్లలో వచ్చిన వేర్పాటు ధోరణిని అధిగమించి మతంతో, జాతితో, వృత్తితో, హోదా అంతస్థులతో నిమిత్తం లేని రీతిలో అందరూ ఒకే చోట ఆటపాటల్లో పాల్గొనటం నేటి ముఖ్యావసరంగా గుర్తించాలి. అన్ని మతాలలోని శాశ్వత మానవ విలువలైన– సత్యనిష్ఠ, ధర్మ నిరతి, దైవభక్తి, దయ, కరుణ, పరోపకారం. సానుభూతి, త్యాగం, ఔదార్యం వంటి సద్గుణాలను వెలికి తీసి, వాటిని ప్రధానాంశాలుగా భావించేటట్లు భావితరాలను తీర్చిదిద్దాలి.

చారిత్రక, వాణిజ్య, వ్యావసాయిక కారణాల వల్ల ఒక ప్రాంతంలో ఒక మతస్తులు, మరో ప్రాంతంలో వేరొక మతస్తులు సంఖ్యాధిక్యత కలిగి ఉండవచ్చు. దాంతో అల్ప సంఖ్యాకులైన సోదరులకు (వారు ఏ మతస్తులైనా) తాము అల్ప సంఖ్యాకులుగానే మిగిలిపోతామేమోననే భయం కలగటం సహజం. అయితే ఈ మానసిక దౌర్బల్యాన్ని అధిగమించడం అవసరం. ఎందుకంటే అలా భయపడినవాళ్లు జనజీవన స్రవంతిలో కలసిపోలేరు. మేము వేరు, వారు వేరు కనుక మేము ఎవరితోనూ కలిసేది లేదని అధిక సంఖ్యాకులు భావించినా, అల్ప సంఖ్యాకులు తలపోసినా– రెండూ ప్రమాదకర ధోరణులే.

ఇందునిమిత్తం పిల్లల్లో సుహృద్భావాన్ని, సహిష్ణుతను, సోదరభావాన్ని, సమానత్వ భావనను, స్వేచ్ఛా పిపాసను నూరిపోయడం అవసరం. అలాగే తప్పుడు వైఖరిని అవలంబించే పెద్దలను, వైషమ్యాన్ని చిలికించే శాంతి విఘాతకులను సన్మార్గానికి మళ్ళించాల్సిన గురుతర బాధ్యత అన్ని మతస్తుల వారిపై ఉంటుంది. 'అల్ ఫిత్నతు అషద్దు మినల్ ఖత్ల్'– కల్లోలం సృష్టించటం, అలజడి రేకెత్తించటం హత్య కన్నా దారుణం అన్న యథార్థాన్ని అందరూ సమానంగా గుర్తించాలి. 'అన్యాయంగా ఒక ప్రాణిని బలిగొంటే సమస్త మానవాళిని బలిగొన్నట్లు. ఒక ప్రాణిని కాపాడితే సమస్త మానవాళిని కాపాడినట్లు' అన్న ఆ సర్వేశ్వరుని శాసనానికి అందరూ తలొగ్గి జీవించాలి. స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా ఈ బృహత్తర కార్య సిద్ధికి అందరూ చిత్తశుద్ధితో పూనుకుంటారని ఆశించటం అత్యాశ కాదేమో!!




# జీవనోపాధి కలలు

**సేకరణ : ఇమామ్‌జీ**

**జీవనోపాధి** కోసం అమెరికా వచ్చిన భారతీయుల మనోభావాల ఆలోచనల అలల తరంగాలు వారి మాటల్లోనే, వినండి..

మేము సంపాదించడానికి కెరీర్ లక్ష్యాలతో USAకి వచ్చాము. డిగ్రీ పూర్తి చేయడం, స్థిరమైన ఉద్యోగాన్ని పొందడం మొదలైన వాటితో సహా ఈ ప్రక్రియకు కనీసం 4-5 సంవత్సరాలు పడుతుంది.

అప్పుడు మేము ఊహించుకున్న, నిర్మించుకున్న జీవితాన్ని రక్షించుకోవడానికి పోరాడతాము. ఇందులో H1B వీసా ప్రక్రియ, గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్, ఇతర సంబంధిత సవాళ్లతో నిండిన వ్యవహారం మా ముందు ఉంటుంది.

ఆ సమయంలో వివాహం, ఆ తర్వాత పిల్లలను కని, భార్యా పిల్లలతో కుదురుకోవడానికి ఓ దశాబ్ద కాలం కరిగి పోతుంది.

తదుపరి దశాబ్దం స్థిరీకరణ, సాధారణ జీవిత సారూప్యతను సాధించడం: గ్రీన్ కార్డ్ కోసం పోరాడడం, ఇంటిని కొనుగోలు చేయడం, స్నేహితుల నెట్‌వర్క్‌ను నిర్మించడంలో మునిగి పోతాము.

ఇంతలో, భారతదేశంలోని మా తల్లిదండ్రులు పెద్దవయస్సులో తాము లేని కొరతను, అవసరాలకు అందుబాటులో లేని మనోవ్యధను పొందుతూ వ్యక్తపరచలేని నిస్సహాయులుగా ఉండిపోతారు. సమకాలిక బంధుమిత్రులు అనుకూల సమయాల్లో వివాహం చేసుకుంటారు. "ఏయ్, నీ పెళ్ళి మార్చిలోనా? సారీ, నా పిల్లలకు స్కూలు ఉంటుంది, మేము మీ పెళ్ళికి రాలేము."

ఇది ఇలా ఉంటే, మాకు H1B స్టాంపింగ్ సమస్యలు ఉన్నప్పుడు, ప్రయాణం చేయలేనప్పుడు తాత నాయనమ్మలు చనిపోతారు. మేము వారిని కడసారి చూసే భాగ్యానికి కూడా నోచుకోము. మా కంపెనీలు ఉద్యోగులను విపరీతంగా తొలగిస్తున్నప్పుడు తల్లిదండ్రులకు గుండెపోటు వస్తుంది, మేము నిస్సహాయులముగా మిగిలి పోతాము.

మేము ఇలాంటి సందర్భాలలో చాలా కోల్పోతాము. భారత దేశంలోని మావాళ్ళు పట్టించుకోరు. వారి జీవితాలు బంధుమిత్రులతో సహజంగానే పెనవేసుకుని సాగుతూ ఉంటాయి. మేనల్లుళ్ళు, మేనకోడళ్ళు మా గురించి ఎక్కువగా తెలియకుండానే పెరిగిపోతారు. వాళ్ళు మమ్మల్ని ప్రతి రెండేళ్లకోసారి "ఫోన్లు తెచ్చే మామ, అత్త" అని తెలిసిన తర్వాత గుర్తు పెట్టుకోవచ్చు.

మేము చిన్నప్పుడు కలిగి ఉన్న అర్థవంతమైన పెద్ద కుటుంబం మా పిల్లలకు దొరకడం లేదు. తాతలు, అమ్మానాన్నలు, అత్తమామలు, కోడలు అంటే ఎవరో వారికి తెలియలేదు. మేమే

అమ్మా నాన్నలం వారి మొత్తం ప్రపంచం అవుతాము.

మేము నిర్మించు కొన్న స్నేహితుల నెట్‌వర్క్ త్వరలోనే అసూయలతో, ఫిర్యాదులతో నిండిపోతుంది. ఆ తర్వాత వారందరు కనిపించేంత అమాయకులు కాదని మేము ఆలస్యం గా నైనా గ్రహించేస్తాం. అప్పుడు, ఎవరు మొదట గ్రీన్ కార్డ్ పొందారు, ఎవరు పెద్ద ఇంటిని కొనుగోలు చేసారు, ఎవరు టెస్లా కలిగి ఉన్నారు, ఎవరు మేనేజర్ అయ్యారు, మొదలైన వాటి ఆధారంగా క్లాస్, మాస్ విభాగాలు కనిపించడం ప్రారంభిస్తాయి.

మేము, అస్తిత్వ ప్రశ్నలలో చిక్కుకుంటాము. నా కొడుకు లేదా కూతురు 16 ఏళ్ల వయస్సులో ఒక అమ్మాయి/ప్రియుడిని ఇంటికి తీసుకువస్తారు.

అప్పుడు, మా సంస్కృతి, దేశం, ఇల్లు వైపు మా ఆలోచనలు మళ్ళుతాయి. మేము, ప్రాంతీయ (తెలుగు/కన్నడ/తమిళం) కమ్యూనిటీ, భారతీయ సంఘాలు, స్వయంసేవకులుగా మొదలైన వాటిలో పాల్గొంటాము. మా పరిస్థితి ఆధారంగా మా రాజకీయ విశ్వాసాలను మార్చుకుంటాము. మేము ఉదార వాదులైతే అంతా బాగానే ఉందని భావించవచ్చు. లేదా మేము వీటన్నింటిని ప్రతిఘటించాలని భావించి మేము సంప్రదాయ వాదిగా మారవచ్చు.

మేము భారతదేశానికి వెళ్లినప్పుడు, మేము అక్కడికి చెందిన వారము కాదనే భావన కలుగుతుంది. ఎందుకంటే, మా బంధువు లందరూ మారిపోతారు. మేము మారిపోయాము అంటారు. అమ్మానాన్నలు ఉండకపోవచ్చు. తెలిసిన వారు చాలా మంది చనిపోయి ఉంటారు. మేనల్లుళ్ళు, మేనకోడళ్ళు గుర్తుపట్టలేరు. మేము పెరిగిన వీధులు, నగరం గుర్తించలేనంతగా మారిపోతాయి.

మళ్లీ మేము తిరిగి వచ్చి మాకు తెలిసిన ప్రపంచంలోకి మునిగి పోతాము. పని చేస్తూనే ఉంటాము కానీ మా ప్రశ్నకు సమాధానం ఎప్పటికీ దొరకదు: "మేము ఇక్కడ బాగానే సంతోషంగా ఉన్నామా లేదా మేము ఇంటికి తిరిగి వెళ్లాలా?"

ఈ ప్రశ్నకు సమాధానం రాదు. కాలచక్రం తిరుగుతూ ఉంటుంది. ఈ జీవిత పోరాటంలో మా ఆశల ఆరాటం మమ్మల్ని యుఎస్ఏ వదలనీయదు. ఎందుకంటే అక్కడ మేము లోన్‌పై కట్టుకున్న ఇంటి అప్పులు ఇంకా తీరనే లేదు. మా పిల్లలకు పై చదువులు చదివించి వారు కూడా మాలాగే అక్కడ స్థిరపడేలా చేయాలి. ఈ పోరాటంలోనే ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మమ్మల్ని పరధ్యానంలో పడవేసింది. అంతలోనే మా ఆత్మ తనువును వీడిపోయే తరుణం ఆసన్నమవుతుంది. శరీరాన్ని వీడి ఊర్ధ్వలోకాలకు సాగిపోతున్న ఆత్మను కళ్లు దీనంగా వెంబడిస్తూ ఉంటాయి... అయిపోయింది, అంతా అయిపోయిందంటూ!

- జీవనోపాధి కోసం USAకి వలస పోయిన భారతీయుడు.


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

**లేదా**

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# అల్లాహ్ ఎవరు?

- అర్షియా, విజయవాడ



**అల్లాహ్ మంచి పేర్లకు అర్హుడు. ఆయనను మంచి పేర్లతోనే వేడుకోండి. (ఖుర్ఆన్ 7:180)**

ప్రవక్తా! వారితో ఇలా అను: ''అల్లాహ్ అని అయినా పిలవండి. లేదా రహ్మాన్ అని అయినా సరే. ఏ పేరుతో అయినా పిలవండి. ఆయనకు గల పేర్లు అన్నీ చక్కనివే.'' (ఖుర్ఆన్ 17:110)

హదీసుల్లో ఆ పరిశుద్ధ అస్తిత్వానికి 99 పేర్లు ప్రస్తావించబడ్డాయి. దివ్య ఖుర్ఆన్‌లోనూ, హదీసుల్లోనూ ఈ పేర్లను జాగ్రత్తగా అధ్యయనం చేసినట్లయితే ప్రపంచంలోని ఇతర భాషల్లో మనిషి అల్లాహ్ ను స్మరించాలంటే ఏ పదాలు ఆయనకు తగినవిగా ఉంటాయో అతి సునాయాసంగా అర్థం చేసుకోగలడు.

## అల్లాహ్ అద్భుతాలు..

భూమిపై ఉన్న వృక్షాలన్నీ కలములై, సముద్రం (సిరా అయి), దానికి ఇంకా ఏడు సముద్రాల సిరాను కలిపినా, అప్పటికీ అల్లాహ్ మాటలు (వ్రాయ టానికి) పూర్తికావు. నిస్సంశయంగా అల్లాహ్ మహాశక్తిసంపన్నుడు, మహా వివేకవంతుడూను. (దివ్యఖుర్ఆన్ 31:26)

## సర్వమూ అల్లాహ్ సృష్టియే

ఆయన, ఆకాశాలను నీవు చూడగలిగే స్తంభాలు లేకుండానే సృష్టించాడు, ఆయన భూమిలో పర్వతాలను అమర్చాడు, మీతో పాటు దొర్లి పోకుండా ఉండేటందుకు. ఆయన అన్ని రకాల జంతువులను భూమిలో వ్యాపింపజేశాడు. ఆకాశం నుండి నీళ్లను కురిపించాడు. భూమిలో రకరకాల శ్రేష్ఠమైన పదార్థాలను పండించాడు. ఇది అల్లాహ్ సృష్టి. (దివ్యఖుర్ఆన్ 31:10-11)

ఆయన ఆకాశాలకూ, భూమండలానికి సృష్టికర్త. తాను ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆయన దానిని కేవలం ''అయిపో'' అని ఆజ్ఞాపిస్తాడు. అది వెంటనే అయిపోతుంది. (దివ్య ఖుర్ఆన్ 2:116)

## గ్రేట్ క్రియేటర్

మేము మానవుణ్ణి మట్టి గారతో సృష్టించాము తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము, ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము, ఆపైన ముద్దను కండగా చేశాము, తరువాత మాంసపుకండను ఎముకలుగా చేశాము, ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము, ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు, సృజనకారులందరిలోకెల్లా ఉత్తమ సృజన కారుడు. (23:12-14)

## ఉపాధి ప్రదాత

వారిని అడుగు : ఆకాశం నుండీ భూమి నుండీ మీకు ఉపాధి నిచ్చేవాడు ఎవడు? వినే శక్తీ, చూసే శక్తీ ఎవడి అధీనంలో ఉన్నాయి? ప్రాణములేని దానినుండి ప్రాణమున్నదానినీ ప్రాణమున్న దానినుండి ప్రాణము లేని దానినీ వెలికితీసేవాడు ఎవడు? ఈ విశ్వవ్యవస్థను నడుపుతున్నవాడు ఎవడు? వారు అల్లాహ్ అని తప్పకుండా అంటారు. ఇలా అను : ''అలాంటప్పుడు మీరు (సత్యానికి వ్యతిరేకంగా నడవటం) మానుకోరేమిటి? ఆ అల్లాహ్ యే మీ నిజమైన ప్రభువు. కనుక సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి? అసలు మీరు ఎటు మరలింపబడుతున్నారు? (దివ్యఖుర్ఆన్ 10:31)

### ఉపాది నిధుల తాళం చేతులు ఆయన వద్దనే

భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధిని ఇస్తాడు తాను కోరినవారికి ఆయన ఆచితూచి ఉపాధిని ఇస్తాడు. ఆయనకు ప్రతి విషయం గురించీ తెలుసు. (42:12)

### అన్ని ప్రాణుల ఉపాధి ప్రదాత ఆయనే..

ధరణిపై సంచరించే ఏ ప్రాణి ఉపాధి అయినా అల్లాహ్ బాధ్యతలో లేకుండా లేదు. ఆ ప్రాణి ఎక్కడ నివసిస్తుందో అది ఎక్కడకు చేర్చబడనున్నదో ఆయనకు తెలియకుండా లేవు. సమస్తమూ ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడి ఉన్నది. (11:6)

### అల్లాహ్ జ్ఞానసంపన్నుడు

ఆయన జ్ఞానం అన్నింటిపై ఆవరించి ఉంది..

అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలిగి ఉన్నాడనీ, అల్లాహ్ జ్ఞానం ప్రతి వస్తువును పరివేష్టించి ఉన్నదనీ మీరు తెలుసుకోవటానికి (ఈ విషయం మీకు తెలియజేయబడుతోంది). (దివ్య ఖుర్ఆన్ 65:12)

ప్రభూ! మేము దాచేదానినీ, బహిరంగపరచే దానినీ నీవు ఎరుగుదువు.'' నిశ్చయంగా అల్లాహ్ కు గుప్తంగా ఉన్నది ఏదీ లేదు, భూమిలోకాని, ఆకాశాలలోకాని. (14:38)

### మనస్సులో ఉన్నది ఆయనకు తెలుసు..

వారికి తెలియదా, అల్లాహ్‌కు వారి గుప్తరహస్యాలూ, వారి రహస్య సమాలోచనలూ సయితం తెలుసని, ఆయనకు సమస్త అగోచర విషయాలు కూడా పూర్తిగా తెలుసని? (9:78)

అల్లాహ్ ఎంతో విలువనిచ్చేవాడు, సౌమ్యుడూను గోచర అగోచరాలను ఎరిగినవాడూ, శక్తి సంపన్నుడు, మహా వివేకవంతుడూను. (64:18)

హృదయాలు తమలో ఏమి దాచి ఉంచాయో, మరేమి బహిర్గతం చేస్తున్నాయో, నిస్సందేహంగా నీ ప్రభువుకు బాగా తెలుసు. (27:74)

భూలోకవాసుల హృద యాల స్థితి అల్లాహ్‌కు బాగా తెలియదా? (29:10)

మేము మానవుణ్ణి సృష్టించాము, అతని మనస్సులో మెదిలే ఊహలను సైతం మేము ఎరుగుదుము. మేము అతని కంఠరక్తనాళం కంటే కూడా అతనికి చాలా దగ్గరగా ఉన్నాము. (50:16)

### ఆయన ఎల్లప్పుడూ మానవుల వెన్నంటి ఉంటాడు..

భూమీ, ఆకాశాలలో ఉన్న ప్రతి వస్తువును గురించి అల్లాహ్ కు తెలుసనే విషయం నీకు తెలియదా? ముగ్గురు వ్యక్తులు కలసి ఏవైనా మంతనాలు జరిపినప్పుడు, వారిమధ్య నాలుగోవాడుగా అల్లాహ్ కాకుండా ఉండటం అనేది ఎన్నడూ జరగదు. లేదా ఐదుగురు వ్యక్తులు కలసి మంతనాలు జరిపినప్పుడు, వారిలో ఆరో వాడుగా అల్లాహ్ కాకుండా ఉండటం అనేది కూడ ఎన్నడూ జరగదు. రహస్యాలోచనలు జరిపేవారు వీరికంటె తక్కువ మంది ఉన్నా లేక ఎక్కువమంది ఉన్నా, వారు ఎక్కడ ఉన్నా, అల్లాహ్ వారితో పాటు ఉంటాడు. ఆ తరువాత ప్రళయదినాన, ఆయన వారికి వారేమేమి చేసివచ్చారో అంతా తెలియజేస్తాడు. అల్లాహ్ ప్రతి విషయం తెలిసినవాడు. (54:7)

### గతించిన.. రాబోయే జాతుల గురించీ ఆయనకు తెలుసు

మీలో పూర్వం గతించిన వారిని కూడా మేము చూశాము. తరువాత వచ్చేవారు కూడా మా దృష్టిలో ఉన్నారు. (15:24)

### ఆయన ఆజ్ఞలేనిదే ఆకు కూడా రాలదు..

అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు. భూమిలోనూ, సముద్రంలోనూ ఉన్నదంతా ఆయనకు తెలుసు. చెట్టునుండి ఏ ఆకైనా ఆయనకు తెలియకుండా రాలదు. భూమిలోని చీకటి పొరలలో ఉన్న ఏ గింజైనా ఆయనకు తెలియకుండా లేదు. తడిగా ఉన్నదీ, పొడిగా ఉన్నదీ అంతా ఒక విపులమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. (6:59)

### మనం చేసేది ప్రతీదీ నమోదవుతోంది..

ప్రవక్తా! నీవు ఏ స్థితిలో ఉన్నా, ఖురాను నుండి దేనిని వినిపించినా, మానవులారా! మీరు ఏది చేసినా, ఆ అన్ని సందర్భాలలోనూ మేము మిమ్మల్ని చూస్తూనే ఉంటాము. భూమ్యాకాశాలలో ఉన్నటువంటి వస్తువు ఏదైనా సరే, అది చిన్నదిగానీ పెద్దదిగానీ దాని అణువు కూడా నీ ప్రభువు దృష్టికి గోప్యంగా లేదు. ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడకుండానూ లేదు. (10:61)

### యజమాన్యం ఆయనదే..

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తానికి అల్లాహ్ యజమాని. అన్ని వ్యవహారాలూ అల్లాహ్ సమక్షంలోనే పెట్టబడతాయి.'' (3:109)

అల్లాహ్ మహోన్నతుడు, నిజమైన చక్రవర్తి. ఆయన తప్ప మరొక దేవుడు లేనేలేడు, గౌరవ పీఠానికి స్వామి. (23:116)

భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు ఆయనే. (57:2)

ప్రతి విషయానికి సంబంధించిన సర్వాధికారాలు తన చేతిలో ఇముడ్చుకున్న ఆయన ఎంతో పరిశుద్ధుడు. (36:83)

ఈ సృష్టి నిర్మాణం ఆయనే చేశాడు..

వాస్తవంగా మీ ప్రభువు అల్లాహ్‌యే. ఆయన ఆకాశాలనూ, భూమినీ ఆరుదినాలలో సృష్టించాడు. తరువాత తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. రాత్రిని పగటిపై కప్పివేస్తాడు. ఆ తరువాత పగలు రాత్రివెంట పరుగుతీస్తూ ఉంటుంది. ఇంకా ఆయన సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, నక్షత్రాలను పుట్టించాడు. అన్నీ ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి. తెలుసుకోండి, సృష్టి ఆయనదే. దానిపై ఆధిపత్యమూ ఆయనదే. అల్లాహ్ అనంతమైన శుభాలు కలవాడు. సకల లోకాలకు ప్రభువు. (7:54)


### సామ్రాజ్యాధికారం ఆయనదే..

ఆయన పగలులోనికి రాత్రినీ, రాత్రిలోనికి పగలునూ జొనుపుతున్నాడు. సూర్యచంద్రు లను ఆయన నియమబద్ధులను చేసి ఉంచాడు. ఇదంతా ఒక నిర్ణీత వ్యవధి వరకు సాగిపోతోంది. (ఈ పనులన్నీ చేసే) ఆ అల్లాహ్‌యే మీ ప్రభువు. సామ్రాజ్యాధికారం ఆయనదే. ఆయనను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు. (35 : 13)

### దేవుడు ఉన్నాడని, ఆయన ఒక్కడే అని నిరూపించే సూచనలు

మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాకరుడు తప్ప మరొక దేవుడు లేడు. (ఈ సత్యం గ్రహించటానికి ఏవైనా గుర్తులు, తార్కాణాలు అవసరం అయితే) వివేకం ఉన్నవారికి భూమ్యాకాశాల నిర్మాణంలో, రేయింబవళ్ళు ఒకదాని వెంట ఒకటి చేసే నిరంతరమైన పయనంలో, ప్రజాబాహుళ్యానికి ఉపయోగపడే వస్తువులు మోసుకుంటూ నదులలో, సముద్రాలలో సంచరించే ఓడలలో, పైనుండి అల్లాహ్ కురిపించే వర్షపు నీటిలో - తద్వారా ఆయన మృతభూమికి ప్రాణం పోస్తాడు. (ఈ ఏర్పాటు ద్వారా) భువిలో వివిధ ప్రాణులను వర్ధిల్లజేస్తాడు- వాయువుల సంచారంలో, భూమ్యాకాశాల మధ్య అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడివున్న మేఘమాలికలలో అసంఖ్యాకమైన సూచనలు కానవస్తాయి. (ఖుర్‌ఆన్ 2:163-164)

## విశ్వేశ్వరుని దృష్టిలో తిరుగుబాటు



మానవుని కొరకు సరయినదిగా, సముచితమయినదిగా అల్లాహ్ సన్నిధిలో గుర్తింపు పొందినది కేవలం ఒకే జీవన వ్యవస్థ, ఒకే జీవిత విధానం. అదేమిటంటే, మనిషి అల్లాహ్‌ను తన స్వామిగా, ఆరాధ్యునిగా స్వీకరించాలి. ఆయన దాస్యం, ఆయన సేవలో తన్ను తాను పరిపూర్ణంగా సమర్పించుకోవాలి. ఆయన దాస్యం చేసే విధానాన్ని మనిషి తానే రూపొందించుకోరాదు, ఆయన తన ప్రవక్తల ద్వారా పంపిన మార్గదర్శకత్వాన్ని కేవలం దాన్నే, ఎలాంటి హెచ్చుతగ్గుల్లేకుండా అనుసరించాలి. ఆలోచన ఆచరణల ఈ విధానం పేరే 'ఇస్లామ్'. విశ్వకర్త, స్వామి తన సృష్టి కోసం, తన పాలితులయిన వారి కోసం ఈ 'ఇస్లామ్' తప్ప మరే ఇతర ఆచరణా సంవిధానాన్ని ధర్మబద్ధమయినదిగా ఆమోదించకపోవడం సంపూర్ణంగా సముచితమయిన విషయమే. మనిషి తన మూర్ఖత్వం మూలంగా, నాస్తికత్వం మొదలుకుని బహుదైవారాధన, విగ్రహారాధన వరకు ప్రతి దృక్పథాన్ని, ప్రతి పంథాను అనుసరించే హక్కు న్యాయంగా తనకు గలదని భావించవచ్చు. కాని విశ్వ పరిపాలకుని దృష్టిలోనయితే ఇది పచ్చి తిరుగుబాటు.

**(ఖుర్‌ఆన్ అవగాహనం– ఆలె ఇమ్రాన్ సూరా 19వ ఆయత్‌కు వివరణ)**

# అరబ్బులు 'ఆడు జీవితం'

కవి కరీముల్లా

అరబ్బు రాజులు పాలకుని ప్రజలే ఎన్నుకోవాలనే ఇస్లామియా సూత్రాన్ని తుంగలో తొక్కి నేటి ఆధునిక ప్రజాస్వామిక యుగంలో సైతం అనువంశిక రాజరికాన్నే పాటిస్తున్నారు. ఈ లోపాలు గమనించిన యూరోపియన్ సామ్రాజ్య వాదులు వీరిని షియాలుగా, సున్నీలుగా చీల్చి ఒకరిపై ఒకరికి విభేదాలు కల్పించి యుద్ధాలు ఎగదోస్తున్నారు.. భారత దేశంలోని హైదరాబాద్ వంటి పేద బస్తీల్లో నిఖా పేరుతో కొంతమంది అరబ్బు విలాసపరుల దుర్మార్గాలను నా కవిత్వంలో ఎప్పుడో ప్రశ్నించాను.

"పాతబస్తీ మఖ్మల్కా పట్టా

పైసాతో నిఖా నామా

నెత్తురు పల్చబడ్డాక తలాఖ్ నామా

యా అల్లాహ్ హమ్ కో మాఫ్ కర్నా"

ఇక 'ఆడు జీవితం' సినిమా గురించి జరుగుతున్న చర్చ గురించి మాట్లాడుకుందాం. నేనా సినిమా చూడలేదు. ఆ సినిమాలో చూపించారని చెప్తున్న ఉదంతాలన్నీ అబద్దాలు కాకపోవచ్చు. అరబ్బుల్లోనూ శ్రమదోపిడీ చేసే తత్వం, క్రూరత్వం నిండిన యజమానులుండటం అసహజమేమీ కాదు.ఆ మాటకొస్తే ప్రపంచంలోని ఏ జాతికి ఇటువంటి మినహాయింపులేమీ లేవు. ఇస్లామియా అవగాహన ఉన్నవారు హజ్రత్ ఉమర్ (రజి) తమ ఆచరణను మార్చుకుంటారు. అలా లేని వారు క్రూరుడైన అబూజహల్‌లా జీవిస్తారు....

దశాబ్దాలుగా పాలస్తీనియన్లను లక్షలమందిని చంపుతూ ఇజ్రాయెల్ సాగించిన, సాగిస్తున్న మారణకాండకు మొత్తం యూదుల్ని నిందించటం, రెండు ప్రపంచ యుద్ధాలలో కోట్ల మంది ప్రజల్ని మట్టుబెట్టిన అమెరికా, తదితర యూరోపియన్లను సాకుగా చూపి మొత్తం యూరోపియన్లను, వారి మతాన్ని నిందించగలమా? మయన్మార్లో రోహింగ్యాలపై బుద్ధిస్టులు అని భావించుకునేవారు సాగించిన హింసకు బౌద్ధం కారణమా? ఏదో ఒక సాకుతో నిరంతరం ఇస్లాంపై సాగించే దుష్ప్రచారం వల్ల ఇస్లాంకు వచ్చిన నష్టం ఏమీ లేదు..కాకపోతే మన అసహనం బయట పడుతుందంతే...

**ఇస్లామియా** ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఈజిప్టు వెళ్తున్నప్పుడు తన సేవకునికి కష్టమివ్వడం ఇష్టం లేక తను ప్రయాణించే ఒంటెపై ఎక్కువ భారం మోపటం ఇష్టం లేక తన వద్ద పనిచేసే ఒంటెను లాగే సేవకునితో నీవు కొద్ది దూరం ఒంటెను నడిపించు,నేను కొద్ది దూరం ఒంటెను నడిపిస్తాను, నేను నడిపేటపుడు నీవు ఒంటెపై కూర్చో అని అన్నారు. అలా వంతులు వేసుకుని ఒంటెపై కూర్చున్నారు... అలా సాగిన ఆ ప్రయాణంలో ఈజిప్టు సరిహద్దుల వద్దకు చేరేసరికి సేవకుడు ఒంటెపై కూర్చుని ఖలీఫా ఉమర్ ఒంటె లాగుతూ ఉన్నారు. అక్కడ వేచి ఉన్న ప్రజలు ఒంటెపై కూర్చుని ఉన్నది సేవకుడని, సేవకుని స్థానంలో ఉన్నది ఖలీఫా అని తెల్సుకుని ఆశ్చర్యపోతారు. మరొక సందర్భంలో అలిసిపోయి విశ్రమించిన సేవకుని కాళ్లు వత్తుతూ సేవ చేస్తారు. ఇది హజ్రత్ ఉమర్ (రజి)లో ఇస్లాం తెచ్చిన మార్పు...ఎవరీ ఉమర్ రజి? ఇస్లాం స్వీకరణకు పూర్వం అత్యంత కఠినాత్మునిగా పేరొందిన ఉమర్ – ఇస్లాం స్వీకరించాక అత్యంత దయామయునిగా, ఇస్లామియా చరిత్రలోనే గొప్ప పాలకునిగా పేరుగాంచారు. మహాత్మా గాంధీ ఓ సందర్భంలో "హజ్రత్ ఉమర్ (రజి) వంటి వారు ఈ భూమండలాన్ని పాలిస్తే మానవాళిలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని అన్నారంటే ఉమర్(రజి) ఏమిటో అర్థమౌతుంది... వీరంతా అరబ్బులే.

ఇస్లాంకు ముందు అరబ్బులు ఎలా ఉండేవారు? జూదం, వ్యభిచారం, మద్యపానం,హింస సర్వ సామాన్యమైన సమాజం. ఒక జాతి వానికి చెందిన ఒంటె దారి తప్పి వేరే జాతి వానికి చెందిన పొలంలో మేత మేస్తే రెండు జాతులు యుద్ధం చేసుకుని వేల మంది మరణించారు. తమకు ఆడపిల్లలు జన్మిస్తే అవమానంగా భావించి ఎడారిలో సజీవంగా పాతిపెట్టే మూర్ఖులతో నిండిన సమాజం. ఇలాంటి సమాజంలో జన్మించిన దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ జాతిని ప్రేమ, దయ, కారుణ్యం వైపునకు నడిపారు. విద్యను, విజ్ఞానాన్వేషణను ప్రోత్సహించి వారిని ఆధునిక యుగం వైపునకు నడిపారు. అందుకు హజ్రత్ ఉమర్ (రజి)లో వచ్చిన మార్పు ఒక ఉదాహరణ మాత్రమే.

నేడు ఇస్లాంపై విమర్శలు పెరిగిన కాలంలో అరబ్బులపై కూడా విమర్శలు పెరిగాయి. ఇస్లాం ఆగమనం తర్వాత ప్రపంచంలో విజ్ఞాన శాస్త్ర ప్రగతికి అరబ్బులు పునాది వేశారు. పవిత్ర ఖుర్ఆన్ మానవులంతా సమానులే అంటోంది. ఒక జాతిని దైవజనులుగా ఇస్లాం చెప్పదు. కాని ఈ రోజెందుకు అరబ్బులు వెనుకబడ్డారు. కారణం వారు ఇస్లాంను కేవలం తమ ప్రార్థనలకు మాత్రమే పరిమితం చేసుకున్నారు. ఆయిల్ బావులతో ఇబ్బడిముబ్బడిగా వచ్చిన సంపదతో ఇస్లాం ప్రబోధించిన విద్య, విజ్ఞానాన్వేషణలకు దూరమయ్యారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాసోహులైన

# నవ జీవనం గురించి కలలు కన్న నాటి కవులు

వాహెద్

**స్వాతంత్ర్యానికి ముందు ప్రగతిశీల, అభ్యుదయ కవులు నవ జీవనం కోసం కలలు కన్నారు. వారి కలల్లో సామ్యవాదం రంగురంగుల సీతాకోక చిలుకలా ఎగిరేది. ఇప్పుడా వాతావరణం లేదు. అయినా ఒకసారి నాటి కవులు రాసిన రచనలను, కవుల జీవితాన్ని చూద్దాం. ముఖ్యంగా తెలుగులో దాశరథి.**

దాశరథి కృష్ణమాచార్య ఉర్దూ నుంచి తెలుగులోకి చేసిన అనువాదాలను పరిశీలించినా, ఆయన కవిత్వంలో తొణికిసలాడే ఉర్దూ మాధుర్యాన్ని చూసినా మనకు స్పష్టంగా ఈ విషయం అర్థమవుతుంది. దీనికి కారణం బహుశా ఆయన విద్యాభ్యాస మంతా ఉర్దూ  మీడియంలో జరగడం కావచ్చు. ఉర్దూ మాధ్యమంలో చదువుకోవడం వల్ల ఆయనకు ఉర్దూ ఫారసీ భాషలపై మంచి పట్టు లభించింది. ఉర్దూ కవిత్వం ఆయన నోట నాట్యమాడేది. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ ముషాయిరా వాతావరణం అలుముకునేది.

నవజీవనానికి వందనం పేరుతో దాశరథి అనువదించిన సర్దార్ జాఫ్రీ దీర్ఘకవిత “నయీ దునియాకో సలామ్” అనువాదంలో రెండు భాషలపై దాశరథికి ఉన్న పట్టు మనకు తెలుస్తుంది. నిజానికి దాశరథికి, అలీసర్దార్ జాఫ్రీకి అనేక పోలికలున్నాయి. ఇద్దరు సామ్యవాద భావాల వల్ల ప్రభావితులైనవారే.ఇద్దరూ ప్రజల కోసం పోరాడినవారే. ఈ పోరాటాల్లో ఇద్దరు జైళ్ళకు వెళ్ళినవారే. ఇద్దరు కూడా సినిమా పాటలు రాసినవారే. ఖుషిఖుషిగా నవ్వుతూ అనే పాటను మనందరికీ తెలిసిందే. ఆయన రాసిన సినిమా పాటల్లో కూడా ఉర్దూ కవితలకు ప్రత్యేకమైన మృదుత్వం, మఖ్మలీ అభివ్యక్తిని మనం అనుభూతి చెందగలం. జనాబ్ జక్కీ సాహెబ్, మౌల్వీ రహీదుల్ హసన్ వంటి ఉపాధ్యాయులు  ఆయనకు ఉర్దూ నేర్పారు. హీరాలాల్ మోరియా కూడా ఆయనకు సహాధ్యాయి. చదువుకుంటున్నప్పుడు ఉర్దూ భాషతో ఏర్పడిన ఈ పరిచయమే పెద్దయ్యాక గాలిబ్ గీతాల వంటి అద్భుతమైన గజళ్ళ అనువాదాలు చేయడానికి, మీర్ తకీ మీర్, బహదూర్ షా జఫర్ వంటి గొప్ప కవులను అనువదించడానికి ఉపయోగ పడింది. ఉర్దూ కవులు చాలా మంది ఆయనకు సన్నిహిత మిత్రులు. మఖ్దూం ముహియుద్దీన్, అమ్జద్ హైదరాబాదీ, షకీల్ బదాయూని, సర్దార్ జాఫ్రీ, హస్రత్ జైపురి, మజ్రూ సుల్తాన్ పురి, సలావుద్దీన్ అయ్యర్, జానిసార్ అక్తర్, రాజా ఆలంబాద్ వంటి గొప్ప ఉర్దూ కవులు ఆయనకు మిత్రులు. ఉర్దూ సాహిత్య ప్రక్రియలైన రుబాయి, గజళ్లను తెలుగు సినిమాల్లో ప్రతిభా వంతంగా ఉపయోగించుకున్నారాయన. “ఓహో గులాబి బాల... అందాల ప్రేమ మాల” పాటను వింటున్నప్పుడు ఈ ఉర్దూ కవన వైభవం మనకు స్పష్టంగా తెలుస్తుంది. తెలుగులో గజల్ ప్రక్రియకు ఆయనే ఆద్యుడు. ఉర్దూ కవిసమయాలను తెలుగు వాతావరణంలో ఇమిడిపోయేలా చేసిన ప్రతిభ ఆయనది.

అలీ సర్దార్ జాఫ్రీ రాసిన “నయీ దునియాకో సలామ్” దీర్ఘకవితకు దాశరథి అనువాదం గురించి చర్చించే ముందు కొంత అలీ సర్దార్ జాఫ్రీ గురించి కూడా మాట్లాడుకుందాం.

కోయీ సర్దార్ కబ్ థా ఇస్ సే పహలే తేరీ మెహఫిల్ మే
బహుత్ అహ్లే సుఖన్ ఉఠే బహుత్ అహ్లే కలామ్ ఆయే
(ఇంతకు ముందు నీ గోష్ఠిలో ఎప్పుడైనా ఎవరైనా నాయకుడు న్నాడా?
చాలా మంది కవులు వచ్చారు, చాలా మంది సాహితీవేత్తలు వచ్చారు)
ఇలా తన గురించి చెప్పగలిగిన ఆత్మవిశ్వాసం గత కవుల్లో ఒక్క గాలిబ్ లో మాత్రమే కనిపిస్తుంది.
హైం ఔర్ భీ దునియా మే సుఖన్ వార్ బహుత్ అచ్ఛే
కహతే హైం కి గాలిబ్ కా హై అందాజె బయా ఔర్ అన్నాడు గాలిబ్
(ప్రపంచంలో గొప్ప కవులు చాలా మంది ఉన్నారు.
కాని గాలిబ్ అభివ్యక్తే వేరు అంటారు)

అలీ సర్దార్ జాఫ్రీ రాసిన అద్భుతమైన కవితల్లో "నయా దునియాకో సలామ్" ఒక విశిష్టమైన కవిత. ప్రముఖ సాహితీవేత్త జాహిదా జైదీ ఈ దీర్ఘకవితను ఒక నాటకంగా ప్రదర్శించవచ్చని భావించారు. జైదీ స్వయంగా ఇంగ్లీషు ప్రొఫెసర్, కవి, నాటకరచయిత్రి, సాహిత్యవిమర్శకురాలు. ఆమె ఈ దీర్ఘకవితలో నాటక నిర్మాణంపై ఒక సుదీర్ఘ ప్రసంగం కూడా చేశారు. ఆమె అభిప్రాయం ప్రకారం సర్దార్ కూడా ఈ రచనను ఒక కవితగానే చూశారు తప్ప ఒక నాటకంగా దీన్ని చూడలేదు. అందువల్ల ఎవ్వరు ఈ రచనలో ఉన్న నాటకనిర్మాణాన్ని గమనించలేదని ఆమె రాశారు. వినూత్నశైలిలో రాసిన దీర్ఘకవితగానే చాలా మంది భావిస్తూ వచ్చారు. సర్దార్ జాఫ్రీ ఈ దీర్ఘకవితకు ముందుమాటలో కూడా దీన్ని ఒక కవితగానే పేర్కొన్నారు. "ఈ కవితలోని పాత్రలు కేవలం సంకేతాలు. ఇంగ్లీషు వాడు దమన నీతికి, ప్రజాపీడనకు సంకేతమైతే, జావీదు, మరియంలు మానవ సంఘర్షణకు ప్రతీకలు. ఇంకా తల్లిగర్భంలోనే ఉన్న శిశువు భవిష్యత్తుకు సంకేతం. అన్యాయం, దౌర్జన్యం ప్రపంచంలో నేటికీ ఉన్నాయి. వాటికి వ్యతిరేకంగా మానవుడు నిరంతరం పోరాడుతూనే వున్నాడు. అయితే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంది." అంటూ తన ముందుమాటలో రాశారు. కాని జైదీ అభిప్రాయం ప్రకారం ఈ కవితలోని పాత్రలు, ఆ పాత్రల భావావేశాలు, అద్భుతమైన నాటకంగా ప్రదర్శించదగినవి. స్వాతంత్ర్యం తర్వాత ఒక కొత్త ప్రపంచాన్ని ప్రజలకు చూపించిన రచన ఇది.

ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ కవులకు ఆయన నాయకుడని ఇస్మత్ చుగ్తాయి చెప్పేవారు. కాని అలీ సర్దార్ జాఫ్రీని కేవలం ఒక అభ్యుదయ కవిగా మాత్రమే చూడడం ఆయన పట్ల అన్యాయం చేయడమే అవుతుంది. అభ్యుదయ భావాలు ఆయన నరనరాన ఉన్నాయన్నది నిజమే కాని ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాదు, ఒక రాజకీయ కార్యకర్త, కవి, మేధావి, రచయిత, పండితుడు, విద్వాంసుడు, గొప్ప మానవవాది. సోవియట్ యూనియన్ ముక్కలైన తర్వాత కూడా కమ్యునిజం పట్ల ఆయన నిబద్దత చెక్కుచెదరలేదు. దాశరథి లోను మనం ఈ లక్షణాలన్నింటిని చూడగలం.

దాశరథి ఈ దీర్ఘ కవితకు చేసిన అనువాదం గురించి మాట్లాడే ముందు మరికొంత దాశరథి అనువాదలను చూద్దాం. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవలసింది గాలిబ్ గీతాల గురించి. గజల్‌లో క్లుప్తత, గాఢత, గుప్తత ముఖ్యమైన లక్షణాలు. అభివ్యక్తిలో ఆర్తి ఉండాలి. వీటన్నింటిని యధాతథంగా తెలుగులోకి తీసుకు రావడమే కాదు, గాలిబ్ వాడిన బెహర్లను అంటే కవితా మీటర్లను తెలుగు ఛందస్సుకు ఒదిగిపోయేలా చేయడం కూడా ఆయన ప్రతిభకు నిదర్శనం. గాలిబ్ నే కాదు దాశరథి మీర్ తకీ మీర్, బహదూర్ షా జఫర్ వంటి కవుల కవిత్వాన్ని కూడా తెలుగీకరించారు. షాయరె తెలంగాణ మఖ్దూం కవితను, హీరాలాల్ మోరియాను, రవీంద్రనాథ్ ఠాగూర్ కవితను, ఇక్బాల్ కవిత్వాన్ని ... ఇలా ఆయన చేసిన అనువాదాలు చాలా ఉన్నాయి.

నవజగానికి వందనం పేరుతో అలీ సర్దార్ జాఫ్రీ దీర్ఘకవితకు ఆయన చేసిన అనువాదం విషయానికి వస్తే, దాశరథి బలంగా నమ్మిన సామ్యవాద సిద్ధాంతం ఈ దీర్ఘకవిత రాయడానికి ప్రేరణ. స్వయంగా అలీ సర్దార్ జాఫ్రీ రాసిన ముందుమాటలో "ఈ చారిత్రక, గతితార్కిక భౌతికవాదపు పునాదుల మీద నేను తొలి సారిగా కాలాన్ని గూర్చి నా స్వంతకల్పనలు చేసుకున్నాను." అన్నాడు.

ఈ కవిత తొలి పలుకుతో మొదలవుతుంది. మొత్తం ఆరు దృశ్యాలను కవి చూపిస్తాడు. తుది పలుకుతో ముగుస్తుంది. ఇతివృత్తంలో గొప్ప ఆకర్షణ ఉంది. అభివ్యక్తిలో నవ్యత ఉంది. సాధారణంగా కవిత అంటే కప్పి చెప్పేదనుకుంటాం. కాని జాఫ్రీ కవితలు విప్పి చెప్పే కవితలు. ఈ కవితలో కూడా ఆయన అస్పష్ట సంకేతాలు, లోతయిన నర్మగర్భ ప్రతీకలు ఉపయోగించ లేదు. అవసరమైతే వివరణాత్మకంగా, విడమరిచి చెప్పిన కవిత. సుదీర్ఘ కవిత నడకలో ఒకేమాదిరి గతిని అనుసరిస్తే పాఠకులకు విసుగు అనిపించవచ్చు. కాని ఈ కవితలో గతి విన్యాసాలు పాఠకుడిని ఆసాంతం చదివిస్తాయి. ఉర్దూ ఛందస్సులో అవసర మైన ప్రయోగాలు చేయడానికి జాఫ్రీ ఎన్నడూ వెనుకడాలేదు. తుదిపలుకు చదువుతున్నప్పుడు మరలా తొలిపలుకు నడకలోనే సాగుతుంది. ఈ దీర్ఘకవితతో జాఫ్రీ ఉర్దూ కవిత్వంపై తనదైన ప్రత్యేక ముద్ర వేశారు. స్వాతంత్రోద్యమం ఈ కవితలో ప్రధాన మైనది. ఈ దీర్ఘకవితలో కేవలం సంఘటనలే కాదు, అనుభూతులను, ప్రభావాలను, మనస్తత్వాలను అద్భుతంగా ఆయన రాశారు. ఇది చదువుతున్నప్పుడు అనువాదమని అనిపించదు. ఉర్దూ కవిసమయాలను, వాతావరణాన్ని తెలుగులో ఒదిగిపోయేలా చేయడం దాశరథి ప్రతిభ. విప్లవభావాలు, మానవ జీవన సంఘర్షణలతో పాటు భావుకత కూడా అంతే ప్రధానంగా కనిపిస్తుంది.

ఈ దీర్ఘకవితకు మీర్జా జాఫర్ అలీ ఖాన్ రాసిన ముందుమాటకు దాశరథి చేసిన అనువాదంలో "ఈ కావ్యంలో కొన్ని ముఖ్య

మిగతా 34వ పేజీలో...




## 2025 హజ్ నోటిఫికేషన్ విడుదల

కొత్త హజ్ విధానంలో 65 ఏళ్లు పైబడిన వారు మెహ్రామ్ (సహచరుడు)తో కలసి ప్రయాణించడం తప్పనిసరి చేసింది. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2025కి సంబంధించిన హజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది, హజ్ కోటాలో 70 శాతం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా (HCOI) కింద ఉంటుందని, మిగిలిన 30 శాతం హజ్ గ్రూప్ ఆర్గనైజర్స్ (HGO) ఉంటుందని తెలియ జేసింది. గత సంవత్సరం, రెండు కేటగిరీల నిష్పత్తి HCOIకి 80 శాతం కాగా, HGOలకు 20 రిజర్వ్ చేయబడింది. కొత్త హజ్ విధానంలో 65 ఏళ్లు పైబడిన వారు మెహ్రామ్ (సహచరుడు)తో ప్రయాణించడం తప్పనిసరి చేసింది. "హజ్ యాత్ర కష్టతరమైన స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే, 65 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న యాత్రికులకు ఒక సహచరుడు తప్పనిసరి అని, 65 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న యాత్రికులు రిజర్వ్‌డ్ కేటగిరీ కింద ఒంటరి సభ్యునిగా నమోదు చేయబడరని నిర్ణయించబడింది" అని కొత్త హజ్ పాలసీ పేర్కొంది. 65 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న యాత్రికులతో పాటు వచ్చే 'మెహ్రం', సహచరుల వయస్సు తప్పనిసరిగా HCoI ద్వారా పేర్కొన్న తేదీ నాటికి 18 మరియు 60 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొంది.

## 2036 నాటికి 152.2 కోట్లకు చేరనున్న జనాభా



భారత జనాభా 2036 నాటికి 152.2 కోట్లకు పెరుగనున్నది. అంతేకాదు మహిళల జనాభా శాతం కూడా కాస్త మెరుగు పడనున్నది. 2011లో 48.5 శాతం ఉండగా అది 48.8 శాతానికి పెరుగనున్నది. ఈ విషయాన్ని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (MoSPI) తెలిపింది. 'విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2023' నివేదిక 15 ఏళ్ల లోపు ఉన్న లింగ నిష్పత్తి తేడా చాలా వరకు తగ్గిపోనుందని పేర్కొంది. ఫెర్టిలిటీ రేట్ కూడా పడిపోయే అవకాశం ఉందని రిపోర్టు పేర్కొంది. కాగా 60 ఏళ్ల కన్నా ఎక్కువ ఉండేవారి జనాభా పెరుగనున్నట్లు రిపోర్టు తెలిపింది. 2036 నాటికి ప్రతి 1000 మంది పురుషులకు 943 మంది మహిళలు ఉండనున్నారని ప్రాజెక్ట్ చేసింది.

## విద్యాసంస్థల్లో హిజాబ్‌లు ధరించొచ్చు.. సుప్రీం సంచలన తీర్పు



కళాశాల క్యాంపస్‌లలో విద్యార్థులు హిజాబ్‌లు ధరించడాన్ని నిషేధిస్తూ ముంబయికి చెందిన ఓ ప్రైవేట్ కాలేజీ ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు (Supreme Court) తాత్కాలికంగా నిలిపి వేసింది. హిజాబ్‌పై నిషేధం విధిస్తే మహిళా సాధికారత ఎలా సాధ్యపడుతుందని కళాశాల యాజమాన్యాన్ని కోర్టు ప్రశ్నించింది. హిజాబ్ ధరించేందుకు ముస్లిం విద్యార్థినులకు అనుమతించింది. ఈ కేసుపై గతంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా సుప్రీం స్టే విధించింది. కళాశాల యాజమాన్యం తీరుపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థినులు ఏం ధరించాలో కాలేజీలు నిర్ణయిస్తే మహిళా సాధికారికత మాటేంటని ప్రశ్నించింది. పేర్లల్లో కూడా మతం ఉంటుందని.. మరి దాన్ని ఎలా తొలగిస్తారని కళాశాల యాజమాన్యాన్ని తిరిగి ప్రశ్నించింది. "అమ్మాయిలు ఏం ధరించాలనేది వారి వ్యక్తిగత నిర్ణయం. దేశంలో అనేక మతాల ప్రజలు నివసిస్తున్న విషయం కళాశాల యాజమాన్యానికి తెలియదా? స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లకుపైనే అవుతున్నా.. ఇప్పటికీ ఇలాంటి అంశాలపై చర్చ రావడం దురదృష్టకరం. మేం ఇచ్చిన ఉత్తర్వులను దుర్వినియోగం చేయకూడదు" అని కోర్టు తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది. కాలేజ్‌లో హిజాబ్ నిషేధంపై పలువురు విద్యార్థినులు సుప్రీం తలుపుతట్టగా.. తాజాగా ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## గాజాలో యుద్ధం ఆపాలి: ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ నేతల పిలుపు

గాజాలో ఇజ్రాయెల్‌హమాస్ మధ్య సాగుతున్న యుద్ధాన్ని ఆపాలని, హమాస్ బందీలో ఉన్న వారిని విడుదల చేయాలని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాల నేతలు పిలుపునిచ్చారు. మానవతా సాయం ఎలాంటి ఆటంకాలు లేకుండా బాధితులకు అందేలా చొరవ తీసుకోవాలని కూడా కోరారు. ఈమేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తాజాగా అమెరికా, కతార్, ఈజిప్టు దేశాలు 10 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్ హమాస్ యుద్ధానికి ముగింపు పలికేలా మధ్యవర్తిత్వం నిర్వహించడానికి తీసుకుంటున్న చొరవకు ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ దేశాల నేతలు మద్దతు పలికారు. మధ్యవర్తులు కొన్ని నెలల పాటు దీనికోసం ప్రయత్నిస్తున్నారు. మూడు దశల ప్రణాళికను అంగీకరింప చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రణాళిక ప్రకారం హమాస్ అక్టోబర్ 7న తాను బందీ చేసిన వారిలో మిగిలిన వారిని తక్షణం విడిచిపెట్టాల్సి ఉంటుంది. అలాగే తాను బందీ చేసిన పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ విడిచిపెట్టాలి. గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ఫ్రెంచి అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ , జర్మనీ ఛాన్సెలర్ ఒలాఫ్‌స్కొల్జ్, బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ సంతకాలు చేశారు.

## అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా

అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా ఆగస్టు 12న బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పదవీవిరమణ చేసిన తరణ్‌జీత్ సింగ్ సంధు స్థానంలో వినరు మోహన్ బాధ్యతలు చేపట్టనున్నారు. తరణ్‌జీత్ సింగ్ సంధు అమెరికా రాయబారిగా 2020 నుండి 2024 వరకు ఉన్నారు. అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రాకు స్వాగతం పలకడం ఆనందంగా ఉందని చార్జ్ డి అఫైర్స్ శ్రీప్రియ రంగనాథన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి మేమంతా ఉత్సాహంగా ఉన్నామని అన్నారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో వాణిజ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వినయ్ మోహన్ క్వాత్రా అధికారిక పత్రాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమర్పించనున్నారు. 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారి క్వాత్రా ఫ్రాన్స్, నేపాల్‌లోనూ భారత రాయబారిగా ఉన్నారు. ఆ తర్వాత విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు.

## హసీనా చెప్పిందంతా అబద్ధం: అమెరికా

బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో అమె రికా ప్రభుత్వం జోక్యం చేసుకుందన్న ఆరోపణలను అగ్రరాజ్యం తోసిపుచ్చింది. వైట్హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియరీ మీడియాతో మాట్లాడారు. అమెరికా కోరినట్టుగా సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని వారికి అప్పగించి, బంగాళఖాతంలో ఆధిపత్యం చెలాయించడానికి అగ్రరాజ్యాన్ని అనుమతించి ఉంటే తాను ప్రధానిగా కొనసాగే దాన్నని హసీనా పేర్కొన్నట్లు వచ్చిన కథనాలను వదంతులుగా పియరీ కొట్టిపారేశారు. బంగ్లాదేశ్ ప్రజలే తమ ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయించుకుంటారన్నారు. బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల సమస్యలపై గళం విప్పడానికి అధ్యక్షుడు జో బైడెన్ ఎప్పుడూ కట్టుబడి ఉంటారని పియరీ పేర్కొన్నారు.

## కరోనా మళ్ళీ వచ్చింది... 84 దేశాల్లో భారీగా కేసులు

కరోనా మళ్ళీ వచ్చింది. 84 దేశాల్లో భారీగా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) హెచ్చరించింది. 2024 ఆగస్టు రెండు వారాల్లో కేసుల సంఖ్య సాధారణం కంటే 20 శాతం పెరిగినట్లు ప్రకటించింది. అంతేకాదు... పారిస్ ఒలింపిక్స్‌లో 40 మంది అథ్లెట్లు కరోనా సంబంధమైన శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారని వెల్లడించింది. కోవిడ్ టెస్టులు చేసే 10 శాతం పాజిటివ్ కేసులు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ డాక్టర్ వాన్ కెర్ఖోవ్ జెనీవాలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో తెలిపారు. కరోనా కేసుల పాజిటివిటీ ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం... అమెరికా, యూరప్, పశ్చిమ పసిఫిక్‌లలో కొత్త ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. గత 18 నెలలుగా కోవిడ్ వ్యాక్సిన్ల లభ్యత బాగా తగ్గిందని డాక్టర్ వాన్ కెర్ఖోవ్ తెలిపారు. కోవిడ్‌ను ఈసారి సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఆయా దేశాలు చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

31వ పేజీ తరువాయి...

భాగాలలో ముక్తచ్ఛందం వాడినా చాలా ఘట్టాలలో జాఫ్రీగారు వాడిన ఛందస్సు మనోరంజకముగాను, గానయోగ్యంగాను ఉంది" అన్నారు. ముక్తఛందం అంటే వచనకవితగా కూడా మనం పొరబడరాదు. ఉర్దూ కవులు లయను ఎన్నడూ వదల్లేదు. అనుప్రాసలతో, కవిత నడకలో తడబాట్లు లేకుండా, గాన యోగ్యంగానే రాశారు. యమకాలు, ప్రాసలు కూడా తప్పనిసరిగా ఉర్దూ కవిత్వంలో కనిపిస్తాయి. జాఫ్రీ వాడిన నడకను తెలుగులో తనదైన పద్ధతిలో తీసుకువచ్చారు దాశరథి.

దీర్ఘకవిత ప్రారంభం పంక్తులే ఈకవిత ఎలాంటిదో చెప్పు గట్టి పునాది వేస్తాయి.

నల్లజెండాలు గాలిలో ఎగురుతున్నాయి

తలయెత్తుకుని నిలుచుని వుంది నల్లటి రేయి

తొలిపలుకులో మొదటి రెండు పంక్తులివి. ఒక విషాదకర ఘట్టానికి నేపథ్యం ఇది. స్వాతంత్ర్య పోరాట పిపాసను రగిలించిన పరిస్థితులవి.

ఆ తర్వాత తొలిచిత్రంలో మొదటి రెండు పంక్తులు చూడండి, ఎంత అద్భుతంగా భావుకతను కవిత్వంలో వ్యక్తీకరించారో-

జాబిల్లి ఎన్నాళ్ళు జలదాల దాగు?

అందమెన్నాళ్ళుండు అనురాగమును వీడి?

జావీద్, మరియంల ప్రణయం ఇది. ఇది భావకవిత. విప్లవం, ప్రేమ, శ్రమ ఇవి మూడు వేర్వేరుగా జాఫ్రీ భావించలేదు.

రెండవ చిత్రంలో మనకు భావుకతతో పాటు విషాదం కూడా ధ్వనిస్తుంది.

భూమిపై రాత్రి కొంత కనురెప్పల నీడ పడుతుంది

చీకటి, భీకర నిశ్శబ్ద భారం మోస్తుంది

అంటున్న ఈ ప్రారంభంలో నిజానికి ఒక విషాదకరస్థితి ఉన్నప్పటికీ ఆ వెంటనే వచ్చిన ద్విపదలో

"గాలిలో క్షణాలు మిణుగురుల వలె యెగురుతున్నాయి

ప్రకృతి గుండెలో బడబాగ్ని జ్వాలలు రగులుతున్నాయి"

ఈ పంక్తుల్లో అభివ్యక్తి సౌందర్యం పాఠకుడిని ఆకట్టుకుంటుంది. అద్భుత ప్రతిభ వుంటేనే ఉర్దూ కవిసమయాన్ని ఇలా తెలుగులో తీసుకురావడం సాధ్యం.

ఆమె కన్నులలో కాటుక, అర్ధరాత్రి నిషావలె వున్నది

చేతులలో గోరింటాకు రంగు దీపాలు వెలుగుతున్నాయి

వంటి పంక్తులు ఈ దీర్ఘకవితలో కలగలిసిన భావుకతను మనకు పరిచయం చేస్తుంది.

జాఫ్రీ దీర్ఘకవిత గురించి ముందుమాట రాస్తూ మీర్జా జాఫరలీ ఖాన్ చెప్పిన మాటలన్నీ దాశరథి అనువదానికి కూడా వర్తిస్తాయి. ముక్తఛందంలోనే రాసినా నడక ఎక్కడ ఎలా అవసరమైతే అలా మార్చుతు తగిన లయను కొనసాగిస్తూ సాగిన అనువాదమిది. దాశరథి కవితా పంక్తుల్లో అవసరమైన చోట్ల అవసరమైన నడకను ఉపయోగిస్తూ అనువాదం కొనసాగించారు. ఉదాహరణకు పైన మనం భావుకత ప్రధానమైన పంక్తులు చూశాం. ఇప్పుడు బ్రిటీషువారిపై తిరగబడుతున్న ప్రజాసమూహాల గురించి రాసిన పంక్తులు చూడండి

హైదరాబాదు యువకవిప్లవ సైన్యం
ఆవేశంతో రణభూమిలోకి వురికింది
రోషకషాయితమైన టిప్పూ సుల్తాన్ ఖడ్గం
రుధిరంతో తడిసి మెరిసిపోయింది

ఈ పంక్తులు కూడా చదవండి

ఇవే- కావేరీ నదీ తీరాలలోను, ప్లాసీ మైదానాల్లోను వందల యేండ్లుగా నిద్రిస్తున్న ఆత్మలు

ఇవే- ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో మీరు తుపాకులతో పేల్చి చిందరవందర చేయగా చెదిరిపడిన దేహాలు

ఇవే- బావులలో, గుంతల్లో, మీరు పారేసిన శవాలు

మీరు నరికిన శిరస్సులివిగో

మీరు నిర్దయతో ఉరి తీయించిన కంఠాలివిగో

ఈ పంక్తులు శరవేగంగా నడుస్తున్న యుద్ధాశ్వాలవంటివి.

ఈ దీర్ఘకవితలో ప్రణయం, విషాదం, ఉద్రేకం, ఆవేదన వెలుగు నీడల్లా ప్రసరిస్తూ పాఠకుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

ఒక దీర్ఘ కవితను ఎలా రాయాలి? ఒక గొప్ప అనువాదం ఎలా చేయాలి? నేర్చుకోవాలంటే ఉర్దూలో అలీ సర్దార్ జాఫ్రీ రాసిన "నయా దునియా కో సలామ్" తెలుగులో దాశరథి అనువాదం "నవ జనానికి వందనం" తప్పక యువ కవులు, రచయితలు చదవాలి.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**